


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



'రన్ గ్రాండ్ మా.. రన్!

- వివరాలు 4 లో..



పెనమలూరు మండలం కానూరులోని తోటకూర వెంకట విజయకుమార్ నివాసంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులు తోటకూర గోపీచంద్, మాళవికలను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి లోకేష్, బ్రాహ్మణి.

# జనాభా భారం కాదు... భాగ్యం

- ఒక్కరు వద్దు, ఇద్దరు ఒకే, ముగ్గురు ముద్దు
- సంతాన సాఫల్య రేటు 2.1కి చేర్చే ప్రణాళికలు
- ప్రభుత్వాసుపత్రుల్లో ఫెర్టిలిటీ సెంటర్ల ఏర్పాటు
- మూడో సంతానానికి రూ.25 వేలు ప్రోత్సాహకం
- ఇద్దరికిమించి పిల్లల్నికంటే ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు
- రాష్ట్రంలో ఉమెన్ హాస్టళ్లు, చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు

2

- ప్రతి నాలుగో శనివారం పాపులేషన్ కేర్‌పై ప్రత్యేక కార్యక్రమం
- నెలాఖరు వరకూ కొత్త పాలసీపై ప్రజాభిప్రాయ సేకరణ
- మాతృత్వ, శక్తి, క్షేమ, నైపుణ్యం, సంజీవని పేరుతో ఫైవ్ పిల్లర్స్
- జనాభా వృద్ధికి దేశంలోనే తొలిసారి నూతన విధానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- అసెంబ్లీలో 'పాపులేషన్ మేనేజ్మెంట్' ముసాయిదాపై ప్రకటన

జనాభా రాష్ట్రానికి భారం కాదు, భాగ్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా జనాభా పెరుగుదల రాష్ట్రానికి భాగ్యమే. ఇన్నాళ్లూ ఫ్యామిలీ ప్లానింగ్‌కి ప్రాధాన్యత ఇచ్చాం. ఇకపై 'పాపులేషన్ కేర్'పై దృష్టి పెట్టనున్నాం. దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో 'పాపులేషన్ మేనేజ్మెంట్' పాలసీ తెస్తున్నాం.

– జనాభా నిర్వహణపై డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రకటించిన సందర్భంలో సీఎం చంద్రబాబు నాయుడు.







## జీరో పావర్టీ మిషన్‌తో
# పేదల జీవన ప్రమాణాల పెంపు

- వివిధ పథకాల అనుసంధానంతో కుటుంబ సాధికారితే లక్ష్యం
- సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ సమన్వయంతో పేదరికంపై సమరం
- డ్వాక్రా మహిళలకు బంగారు మిత్రలుగా బాధ్యత
- జీరో పావర్టీ మిషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

3



## ప్రకృతి వైపరీత్యాల్లో
# రైతుకు కూటమి అండ

- ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకుపెంచిన ఘనత కూటమిదే
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల పంటల బీమాలో నష్టపోయిన రైతాగం
- అరకు కాఫీ తోటల్లో 'కాఫీ బెర్రీ బోరర్'పై తక్షణ చర్యలు.. సబ్సిడీ మంజూరు
- సభ్యుల ప్రశ్నలకు మండలిలో సేద్యం మంత్రి అచ్చెన్న సమాధానం

5



## శంకుస్థాపన చేసింది నేనే...
## ప్రాజెక్టునుంచి నీళ్లిచ్చేదీ నేనే..

- వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు నాయుడు
- శంకుస్థాపనచేసి 30 ఏళ్లవుతున్న సందర్భంలో ఎక్స్‌లో పోస్టు
- 1996 మార్చి 5... ఆ రోజు ఇంకా గుర్తుందంటూ వ్యాఖ్య

3






ఎంత అద్భుతమైన మ్యాచ్! ఇంగ్లాండ్‌పై అద్భుతమైన విజయం సాధించి, ఐసీసీ పురుషుల టి20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరిన టీం ఇండియాకు అభినందనలు. సంజుసామ్సన్, శివందుబే అద్భుతమైన ఇన్నింగ్స్.. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా శక్తివంతమైన బౌలింగ్.. అక్షర్ పటేల్ ఎలక్ట్రిక్ ఫీల్డింగ్.. పూర్తి జట్టు ప్రదర్శన, ఉత్కంఠభరితమైన ఆట. ఫైనల్‌కు టీం ఇండియాకు శుభాకాంక్షలు.

–నారా చంద్రబాబు నాయుడు.

టీం ఇండియా అద్భుత ప్రదర్శన. సంజుసామ్సన్, శివం దూబే అద్భుతమైన ఆటతీరు. టి20 ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై చిరస్మరణీయ విజయానికి మమ్మల్ని ప్రేరేపించింది. ఈ ఆధిపత్య ప్రదర్శనకు మొత్తం జట్టుకు అభినందనలు. దేశం మిమ్మల్ని ప్రోత్సహిస్తోంది! ఫైనల్‌కు శుభాకాంక్షలు. కప్‌ను ఇంటికి తీసుకురండి!

– నారా లోకేష్

## లడ్డూ కల్తీ నివేదికలు
# తొక్కిపట్టారు

- తిరుమలపై మహావిషం చిమ్ముతున్నారు
- మండలిలో మంత్రి ఆనం ఆగ్రహం

5

## మగ్గం వస్త్రాలనే
# కొనుగోలు చేస్తాం


- నేతన్నలకు ఎంతో మేలు జరుగుతుంది
- ఏడాదిపాటు ఉపాధి అవకాశం
- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



8

# జనాభా భారం కాదు... భాగ్యం

- ఒక్కరు వద్దు, ఇద్దరు ఒకే, ముగ్గురు ముద్దు
- సంతాన సాఫల్య రేటు 2.1కి చేర్చే ప్రణాళికలు
- ప్రభుత్వాసుపత్రుల్లో ఫెర్టిలిటీ సెంటర్ల ఏర్పాటు
- మూడో సంతానానికి రూ.25 వేలు ప్రోత్సాహకం
- ఇద్దరికిమించి పిల్లల్నికంటే ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు
- రాష్ట్రంలో ఉమెన్ హాస్టళ్లు, చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు
- ప్రతి నాలుగో శనివారం పాపులేషన్ కేర్‌పై ప్రత్యేక కార్యక్రమం
- నెలాఖరు వరకూ కొత్త పాలసీపై ప్రజాభిప్రాయ సేకరణ
- మాతృత్వ, శక్తి, క్షేమ, నైపుణ్యం, సంజీవని పేరుతో ఫైవ్ పిల్లర్స్
- జనాభా వృద్ధికి దేశంలోనే తొలిసారి నూతన విధానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి
- అసెంబ్లీలో 'పాపులేషన్ మేనేజ్మెంట్' ముసాయిదాపై ప్రకటన




అమరావతి (చైతన్య రథం): జనాభా రాష్ట్రానికి భారం కాదు, భాగ్యమని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు నాయుడు. మారుతున్న కాలానికి అనుగుణంగా జనాభా పెరుగుదల రాష్ట్రానికి భాగ్యమే అవుతుందన్నారు. ఇన్నాళ్లూ ఫ్యామిలీ ప్లానింగ్‌కి ప్రాధాన్యత ఇచ్చామని, ఇకపై 'పాపులేషన్ కేర్'పై దృష్టి పెట్టనున్నట్టు వెల్లడించారు. దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో 'పాపులేషన్ మేనేజ్మెంట్' పాలసీ తెస్తున్నట్టు స్పష్టం చేశారు. జనాభా నిర్వహణపై డ్రాఫ్ట్ పాలసీపై శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. ఏపీలో ప్రస్తుతం టోటల్ ఫెర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 1.5గా ఉందని, దీనిని 2.1కి పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీవంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని, భారతదేశంలోనూ, ముఖ్యంగా ఏపీలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొందన్నారు. 1992-93లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీఎఫ్ఆర్ 3.0గా ఉండేదని గుర్తు చేశారు. టీఎఫ్ఆర్ మరింత వేగంగా తగ్గితే వర్క్ ఫోర్స్ పడిపోతుందని... దీంతో ఆర్థిక వృద్ధి మందగిస్తుందని వివరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మరింత నష్టం వాటిల్లుతుందనే ఆలోచనతో ఈ డ్రాఫ్ట్ పాలసీకి రూపకల్పన చేశామని పేర్కొన్నారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో కేవలం ఏడాదికి 6.7 లక్షల జననాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇది ఇలాగే కొనసాగితే 2047నాటికి రాష్ట్ర జనాభాలో 23శాతంమంది వృద్ధులే ఉంటారన్నారు. 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' పాలసీ డాక్యుమెంట్ అందరికీ అందుబాటులో ఉండేలా ఆన్‌లైన్‌లో పెడుతున్నట్టు సీఎం ప్రకటించారు. దీనిపై రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో నెలపాటు ప్రజా ప్రతినిధులు ప్రజల్లో ఈ అంశంపై చర్చ నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ నెల నాలుగో శనివారం జనాభా నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నెలాఖరుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీకి తుదిరూపునిచ్చి, ఏప్రిల్ 1నుంచి అమలు చేస్తామన్నారు. ఏడాది తర్వాత ఫలితాలు పరిశీలించి పాలసీలో మార్పులు చేర్పులు చేస్తామని వెల్లడించారు. హెల్దీ వెల్దీ హ్యాపీ ఏపీ అనేది పాపులేషన్ మేనేజ్‌మెంట్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మాతృత్వ, శక్తి, క్షేమ, నైపుణ్యం, సంజీవని ఈ ఐదు పాపులేషన్ మేనేజ్‌మెంట్‌కు మూలస్తంభాలని సీఎం చంద్రబాబు వివరించారు.

## మహిళల వర్క్ ఫోర్స్ పెరిగితే జీఎస్డీపీ వృద్ధి

ముఖ్యమంత్రి మాట్లాడుతూ "మహిళల వర్క్ ఫోర్స్ ప్రస్తుతం కేవలం 31 శాతం మాత్రమే ఉంది. ఇది 59 శాతానికి చేరుకుంటే రాష్ట్ర జీఎస్డీపీ 15 శాతం పెరుగుతుంది. గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకూ ప్రతి జీవిత దశలోనూ ప్రభుత్వ మద్దతు ఉంటుంది. పిల్లలు లేక, ఫెర్టిలిటీ సమస్యతో బాధపడుతున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతిస్తాం. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వాసుపత్రుల్లో ఐవీఎఫ్ సేవలు పీపీపీ విధానంలో అందిస్తాం. సిజేరియన్లు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే, ప్రస్తుతం 8.8 శాతం ఉన్న టీనేజ్ గర్భధారణలను 3 శాతంలోపు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 50మంది చిన్నారులు, మహిళలు ఒక ప్రాంతంలో ఉంటే చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం. షి క్యాబ్‌లు అందుబాటులోకి తెస్తాం. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపట్టాం. ఏ ప్రాంతంలో మహిళా ఉద్యోగులు పనిచేస్తారో అక్కడ కొత్తగా వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. మూడో సంతానం, ఆపై జననాలకు 12 నెలల పేరెంటల్ లీవ్ -తండ్రులకు 2 నెలలు పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నాం. మూడో సంతానానికి 'పోషణ-శిక్షా-సురక్ష' ప్యాకేజ్ ఇస్తాం. మూడో సంతానానికి డెలివరీ సమయంలో రూ.25,000 ప్రోత్సాహకంగా ఇవ్వడంతోపాటు ఐదేళ్లపాటు నెలకు పోషణ కింద రూ.1,000 సాయం, 18 ఏళ్ల వరకూ ఉచిత విద్య అందిస్తాం. త్వరలో 'తల్లి దండ్రుల సమాన బాధ్యత' పేరిట కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ చేపడతాం. చైల్డ్ కేర్టేకర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం' అని ప్రకటించారు.

## 2047నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభా 23శాతం

"2047 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నాం. వృద్ధుల సంరక్షణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తాం. 175 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తాం. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటారింగ్‌లో భాగం చేస్తాం. రిటైర్‌మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి కింద అందిస్తాం. వైద్య సేవలు అందించేందుకు డిజిటల్ మౌలిక వసతులు అభివృద్ధి చేస్తాం. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థకు డిజిటల్ నెర్వ్ సిస్టమ్ ప్రాజెక్ట్ సంజీవని నిలుస్తుంది. ఇది కుప్పంలో విజయవంతమైంది. త్వరలో రాష్ట్రమంతా అమలు చేస్తాం. ఈ ఏడాది జూలై నాటికి 5.2 కోట్ల ప్రజలను 2,086 ఆరోగ్య కేంద్రాల ద్వారా డిజిటల్‌గా సంజీవని ప్రాజెక్టుతో అనుసంధానిస్తాం. రాష్ట్రంలో 71 లక్షల హై-రిస్క్ కేసులు గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నా"మని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## సభ్యుల అభిప్రాయాలపై స్పందించిన సీఎం

పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ ప్రకటనపై శాసనసభలో సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మాల్తూషియన్ థియరీ ఆఫ్ పాపులేషన్‌పై గతంలో విస్తృత చర్చ జరిగేదని.. ప్రకృతి విపత్తులు, మహమ్మారులు వస్తే జనాభా నియంత్రణ జరుగుతుందని ఈ థియరీని ప్రతిపాదించినట్టు సీఎం చెప్పారు. 1996-97 సమయంలో ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన కోసం బ్రేక్ సైలెన్స్ అంటూ ప్రచారాలు నిర్వహించామని.. దాంతో రాష్ట్రంలో ఎయిడ్స్‌పై నియంత్రణ సాధ్యమైందన్నారు. అలాగే, ఆర్థిక సంస్కరణలు, సెల్‌ఫోన్‌లాంటి టెక్నాలజీ విప్లవం, ఫ్యామిలీ ప్లానింగ్‌లాంటి అంశాలు ఎన్నో అమలుచేసి విజయం సాధించామన్నారు. మొదట్లో జనాభా నిర్వహణ గురించి మాట్లాడితే కొందరు విమర్శించారని, ఇప్పుడు అంతా జనాభా నిర్వహణ గురించే మాట్లాడుతున్నారన్నారు. దక్షిణ భారతదేశంలో జనాభా క్షీణత నమోదు అవుతోందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఇప్పుడు ఒక్కరు వద్దు, ఇద్దరు ఒకే, ముగ్గురు ముద్దు అనే నినాదం తీసుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు.

## దూరదృష్టితోనే పాపులేషన్ మేనేజ్‌మెంట్

"పేదలు, గిరిజనులు ఎక్కువ పిల్లలను కంటున్నారు. కానీ ఏపీఎల్ కుటుంబాల్లో మాత్రం ఈ పరిస్థితి కనిపించటం లేదు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వటం ద్వారా జనాభా నిర్వహణకు మద్దతిచ్చేలా చర్యలు ప్రారంభించాం. చైనా కేవలం ఒక్క సంతానంతో ఇప్పుడు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రపంచంలో మహిళలకు గౌరవం ఇచ్చే ఏకైక దేశం భారత్ మాత్రమే. ఎన్డీఏ ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించనుంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా దూరదృష్టితో ఆలోచన చేసే పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తున్నాం. మన సమాజంలో మైక్రో ఫ్యామిలీస్ అనే విధానం కూడా మారాల్సిన అవసరం ఉంది. పెద్ద కుటుంబాలు కలిసి ఉండేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందించేలా ఆలోచన చేస్తున్నాం. కుటుంబంలో ఎంతమంది ఎక్కువ ఉంటే అంత ఎక్కువగా ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందించేలా విధానాల్లో మార్పు తీసుకురావాలి. గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందో అని ఆందోళన చెందాను. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా విధానాలు మార్చుకున్నాం. పూర్వం ఆస్తికంటే పిల్లలకే ఎక్కువ విలువ ఇచ్చే పరిస్థితి ఉండేది. టీనేజి ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాలు గతంలో జరిగేవి. ఇప్పుడు లేట్ మ్యారేజ్ వల్ల కూడా సంతాన లోపం జరుగుతోంది. ఇలాంటి సామాజిక అంశాలపై కూడా ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించాల్సి ఉంది. జనాభా తగ్గుతున్న పరిస్థితుల్లో నెలకొన్న ఈ సంక్షోభాన్ని ఓ అవకాశంగా తీసుకుని ప్రణాళికలు రూపొందించాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ప్రజాభిప్రాయం మేరకే తుది పాలసీ

ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో సమాజంలో జీవితాలు అన్నీ యాంత్రికంగా మారిపోయాయి. యాంత్రిక జీవితం తోనే అసలు మానసిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఏపీ జనాభా 5 కోట్లకు తగ్గకుండా నిర్వహిస్తేనే తెలుగు జాతి శక్తివంతమైన జాతిగా నిలుస్తుంది. ప్రజాహితం కోసం,ఆర్థిక అసమానతలను తొలగించేలా నిర్ణయాలు తీసుకుందాం. అత్యున్నత జీవన ప్రమాణాల కోసం పునాది వేయబట్టే హైదరాబాద్ ఇప్పుడు అత్యుత్తమ నగరంగా ఎదిగింది. ఇప్పుడు ప్రణాళికలు చేస్తేనే వచ్చే 30 నుంచి 40 ఏళ్లలో సమాజంలో సుస్థిరత, సంపద, సమృద్ధి చేకూరతాయి. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ప్రజాభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్తాం. ఈ పాలసీపై చట్ట సభలో తీసుకున్న ఈ సంకల్పం చిర స్థాయిగా నిలిచిపోతుంది. ప్రజలు కూడా ఈ సంకల్పాన్ని అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

## మెట్లవారి వివాహ వేడుకకు
# మంత్రి లోకేష్ హాజరు

విశాఖపట్నం (చైతన్య రథం): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల వెంకటరమణ (రమణబాబు) సోదరుని కుమారుడి వివాహ వేడుకలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విశాఖలోని వాల్తేర్ క్లబ్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు సత్యనారాయణ రావు, లక్ష్మీ సౌపర్ణికలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి లోకేష్ వెంట పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. తొలుత.. విశాఖ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పిలకారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్, కార్యకర్తలను కలిసి వారితో ఫోటోలు దిగారు.







ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో వీఆర్ శ్రీనివాస్ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులు వేంకటరామానుజ జశ్వంత్, తారక రస్యకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. కానూరులో తోటకూర వెంకట విజయ్ కుమార్ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులు గోపీచంద్, మాల్వికకు దీవెనలు అందించారు.

## జీరో పావర్టీ మిషన్‌తో

# పేదల జీవన ప్రమాణాల పెంపు



- వివిధ పథకాల అనుసంధానంతో కుటుంబ సాధికారితే లక్ష్యం
- సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ సమన్వయంతో పేదరికంపై సమరం
- డ్వాక్రా మహిళలకు బంగారు మిత్రలుగా బాధ్యత
- జీరో పావర్టీ మిషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో పేదరికాన్ని సంపూర్ణంగా రూపుమాపి, పేదల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా జీరో పావర్టీ మిషన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలో సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ విభాగాలతో జీరో పావర్టీ మిషన్ కుటుంబ సాధికారితపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీకృత వ్యూహంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల సంస్థలు సెర్ప్, మెప్మా, ఆర్టీజీఎస్ వ్యవస్థలను సమన్వయం చేస్తూ జీరో పావర్టీ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎస్‌హెచ్‌జీలకు సంబంధించి ఈ వ్యవస్థల నెట్వర్క్ ద్వారా 1.3 కోట్ల కుటుంబాల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశంపై వివిధ దేశాలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న అత్యుత్తమ పేదరిక నిర్మూలన విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2047 స్వర్ణాంధ్ర మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో జీరో పావర్టీ మిషన్ సమర్థంగా చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన మిషన్‌కు సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్లను సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. అటు జాతీయ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా పట్టణ ప్రాంతాల్లోనూ పేదరిక నిర్మూలన కోసం ప్రణాళికలు చేయాలన్నారు. వీటితోపాటు స్వయం సహాయ సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు స్వయం పేరిట బ్రాండింగ్ ఇచ్చి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

### కుటుంబం యూనిట్‌గా పథకాలు

ప్రభుత్వ పథకాలు, పీ4 విధానం స్వయం సహాయక సంఘాల సహకారంతో ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని మార్గదర్శి - బంగారు కుటుంబం వీదీఖ 10-20 గా పిలవాలని సూచించారు. సమాజంలో అట్టఅడుగున ఉన్న 20 శాతం మందిని ఆర్థికంగా ఎగువన ఉన్న 10 శాతం స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. పేదరికం నుంచి బయటపడిన వారికి ఒక గౌరవ ప్రదమైన పేరును ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల అమలును వ్యక్తిగతంగా కాకుండా ఫ్యామిలీ యూనిట్ గా పరిగణించాలి సీఎం సూచించారు. ఆరోగ్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాల ద్వారా ఒక కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో అంచనా వేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లస్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంలో జీరో పావర్టీ మిషన్ మొదటి అడుగు అని ముఖ్యమంత్రి వివరించారు. డ్వాక్రా సభ్యుల సేవలను వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, వారిని ఎంఎస్ఎంఈలుగా ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన చేసింది నేనే...

# ప్రాజెక్టునుంచి నీళ్లిచ్చేదీ నేనే..

**వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు నాయుడు**

**శంకుస్థాపనచేసి 30 ఏళ్లవుతున్న సందర్భంలో ఎక్స్‌లో పోస్టు**

**1996 మార్చి 5... ఆ రోజు ఇంకా గుర్తుందంటూ వ్యాఖ్య**

అమరావతి (చైతన్య రథం): "1996 మార్చి 5.... ఆ రోజు నాకిందా గుర్తింది" అంటూ వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రోజును గుర్తు చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నేటికి 30ఏళ్లు అయిన సందర్భంలో వెలిగొండ పాజెక్టును గుర్తు చేసుకుంటూ ఎక్స్ వేదికపై రాష్ట్ర ప్రజలకు సుదీర్ఘ పోస్టు పెట్టారు. "ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే.. వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్లక్రితం తొలి అడుగువేసిన రోజు అది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షలమందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో.... శ్రీశైలం ప్రాజెక్టు జలాశయం ఫోర్‌షోర్ నుండి 43.5 టీఎంసీ నీటిని వినియోగించుకోవాలనే ఆలోచనతో.... 30ఏళ్లక్రితం ఇదే రోజున (1996 మార్చి 5న) ముఖ్యమంత్రిగా నేను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను.

అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014-19 మధ్య వేగవంతం చేశాము. ప్రాజెక్టు కోసం నాడు రూ.1,414 కోట్లు ఖర్చు పెట్టాం. తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవమంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలైంది.

2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చాం. రూ.140 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్ చేశాం. రూ.585 కోట్లు ప్రాజెక్టు నిర్మాణంపై ఖర్చు చేశాం. హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది జూలైనాటికి తొలి ఫేజ్ పనులు పూర్తి చేసి వెలిగొండకు కృష్ణా నీళ్లు తీసుకొస్తాం. 2027-28నాటికి ఫేజ్-2 నిర్మాణం పూర్తి చేస్తాం.

ప్రజల దశాబ్దాల కలను నిజం చేసి... కరవు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి.... రైతన్నల జీవితాలు మారుస్తాం. హార్టికల్చర్ సాగుతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే అని ప్రకటిస్తున్నా" అంటూ సీఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘ పోస్టులో ప్రజలకు ప్రామిస్ చేశారు.



చైతన్యరథం

# 'రన్ గ్రాండ్ మా.. రన్!




- **నేటితరానికి మీనాటితరం ఎప్పుడూ స్ఫూర్తి**
- **80ఏళ్ల రామసుబ్బమ్మ విజయగాథపై లోకేష్ స్పందన**

అమరావతి (చైతన్య రథం): టీనేజ్ పిల్లలతో పరుగుపందెంలో పోటీపడిన ఓల్డేజ్ గ్రాండ్ మాకు శిరసువంచి నమస్కారం. నేటితరానికి మీనాటితరం ఎప్పుడూ స్ఫూర్తి" అంటూ విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ భావోద్వేగంతో ప్రకటించారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన 80ఏళ్ల రామసుబ్బమ్మ విజయ గాథపై ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ఐ యామ్ ఫస్ట్.. 32 గోల్డ్.. 14 సిల్వర్ అంటూ విజయగర్వంతో ప్రకటిస్తోన్న నెల్లూరుజిల్లా కావలికి చెందిన 80 ఏళ్ల రామసుబ్బమ్మ కథనాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన బీబీసీ తెలుగుకు అభినంద నలు. పరీక్ష ఫెయిలయ్యా మని, టాప్ ర్యాంక్ రాలేదని, క్రీడల్లో పతకాలు సాధించలేకపోయామని నిరుత్సాహపడే నేటితరం..బామ్మగారిని ఆదర్శంగా తీసుకోవాలి. ఆమె క్రీడాస్ఫూర్తి, లక్ష్యసాధనకు చేసిన కఠోర శ్రమకు శిరసువంచి నమస్కరిస్తున్నాను.

చిన్నపిల్ల వయసులో ఆటలు ఆడేది, పేదరికం అడ్డంకిగా మారింది. పెళ్లయ్యింది. పిల్లలు, కుటుంబ బాధ్యతలతో పరుగు ఆగిపోయింది. ఇళ్లల్లో పనిచేసి కుటుంబాన్ని పోషించింది. చదువు విలువ తెలిసిన తల్లి చొరవతో పిల్లలు సెటిలయ్యారు. తన కలను సాకారం చేసుకునేందుకు అడుగులు వేసింది. చిన్నప్పుడు ఆగిపోయిన పరుగును వృద్ధురాలయ్యాక ఆరంభించింది. మనస్సులోని సంకల్పానికి 80ఏళ్ల వయస్సు అడ్డుకాలేదు. బాలికలతోనూ పరుగుపందెంలో పాల్గొని పతకాలు సాధిస్తోంది. యంగ్ అండ్ డైనమిక్ అథ్లెట్ రామసుబ్బమ్మకు హృదయ పూర్వక అభినందనలు. జాతీయ పరుగు పందెంలో పోటీపడాలను కుంటున్న బామ్మగారికి మనవడు లోకేష్ అండగా నిలుస్తాడు. ఏం సాయం కావాలన్నా అందిస్తాడు. రన్ గ్రాండ్ మా.. రన్..!!" అంటూ మంత్రి లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు.

### సచిన్ కుమారుడి వివాహ వేడుకకు

# హాజరైన మంత్రి లోకేష్ దంపతులు

ముంబయి (చైతన్య రథం): క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హాజరయ్యారు. గురవారం ఉదయం ముంబయి చేరుకున్న మంత్రి లోకేష్ దంపతులు అక్కడ సెయింట్ రెజిస్ హోటల్‌లో జరిగిన సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ మహోత్సవంలో పాల్గొన్నారు. సచిన్ టెండూల్కర్ కుటుంబం మంత్రి లోకేష్ దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లను మంత్రి లోకేష్ దంపతులు ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తరలివచ్చారు.









## మంగళగిరిలో వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్


మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశమనేని శ్రీ అనిత కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని గోపు గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు నీలేష్, ఐశ్వర్యలకు వివాహ శు భాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



## తోటకూర విజయ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన లోకేష్

విజయవాడ (చైతన్య రథం): పారిశ్రామికవేత్త తోటకూర వెంకట విజయ్‌కుమార్ కుమారుడి వివాహానికి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు.

విజయవాడ కానూరులోని ఆయన స్వగృహంలో జరిగిన పెళ్లి వేడుకలో పాల్గొని నూతన వధూవరులు గోపీచంద్, మాల్వికలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



### మహిళా నేత వాసిరెడ్డి పద్మ కుమార్తె

# వివాహ వేడుకకు లోకేష్ హాజరు

విజయవాడ (చైతన్య రథం): ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు మేఘన, చక్రధారిలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రకృతి వైపరీత్యాల్లో రైతుకు కూటమి అండ

- ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25 వేలకుపెంచిన ఘనత కూటమిదే
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల పంటల బీమాలో నష్టపోయిన రైతాగం
- అరకు కాఫీ తోటల్లో 'కాఫీ బెర్రీ బోరర్'పై తక్షణ చర్యలు.. సబ్సిడీ మంజూరు
- సభ్యుల ప్రశ్నలకు మండలిలో సేద్యం మంత్రి అచ్చెన్న సమాధానం



అమరావతి (చైతన్య రథం): ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం, అరకులో కాఫీ తోటలనష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి శాసనమండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు ఫీల్డ్‌స్థాయిలో పంట నష్టాన్ని వారంలో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి వివరించారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రభుత్వం చర్యలు**

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**పంటల భీమా వ్యవస్థపై వివరణ**

పంటల భీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి పసల్ భీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత భీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు భీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ.2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మళ్లీ పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.


**అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణకు చర్యలు**

అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని మంత్రి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## పుట్టపర్తికి ఆధ్యాత్మిక, పర్యాటక సొబగు

**ఎమ్మెల్యే సింధూర సూచనపై సీఎం సానుకూలం**

**రూపురేఖలు మార్చేందుకు సిద్ధమవుతున్న ప్రణాళికలు**



పుట్టపర్తి (చైతన్య రథం): పుట్టపర్తి గ్రేటర్ ప్రశాంతి గ్లోబల్ సిటీ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచనమేరకు సీఎం చంద్రబాబు స్పందించారు. పుట్టపర్తి ఆధ్యాత్మిక రాజధానిగా, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులేస్తోంది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి డిపిఆర్‌ను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి నారా లోకేష్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ మంత్రి ఆనంతోపాటు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, దేవాదాయ ఉన్నతాధికారులుకు సమర్పించారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిని ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా, బుక్కపట్నం చెరువును పర్యాటక ప్రాంతంగా.. చుట్టుపక్కలున్న విజయనగర సామ్రాజ్య కాలంనాటి పురాతన ఆలయాలు, శాసనాలు కట్టడాలు పరిరక్షణ, అభివృద్ధికి నిధులు కేటాయించి.. ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వ సూచన మేరకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ రెండు రోజుల క్రితం సత్యసాయి కలెక్టరేట్‌లో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు పుట్టపర్తి పరిసరాలను పర్యావరణ– ఆధ్యాత్మిక హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు చేపట్టనున్నారు. బుక్కపట్నం చెరువులో భగవాన్ శ్రీ సత్యసాయి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, పుట్టపర్తికి ఔటర్ రింగ్ రోడ్లు, గ్రోత్ కారిడార్ల నిర్మాణంపై సాధ్యసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు.

**అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి**

అంతేకాకుండా జిల్లాలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ, జిల్లాలోని సాంస్కృతిక చారిత్రక కట్టడాలు పర్యాటక అభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం తగిన ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. సత్యసాయి జిల్లా పర్యాటక అభివృద్ధి, పుట్టపర్తి ఆధ్యాత్మిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సత్యసాయి జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా అటవీ అధికారి, డిఆర్‌డిఎ పీడీ, టౌన్ ప్లానింగ్ అధికారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్, పురావస్తు శాఖ అధికారులు మరియు ఇతర జిల్లాస్థాయి అధికారులు ప్రభుత్వానికి తగిన నివేదికలు అందించారు.

## ముంపు కాలనీలకు రక్షణ గోడ

**నడిమివంక, మరువవంక ప్రొటెక్షన్ వాల్స్‌కు నిధులివ్వండి**

**మున్సిపాల్టీల అభివృద్ధికి సహకరించండి**

**శిల్పారామంలో సమస్యల పరిష్కారానికి కృషి**

**సోలార్ పార్కు ఏర్పాటుకు అనుమతివ్వండి**

**అర్బన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన చంద్రబాబు నాయుడు**



ఉండవల్లి (చైతన్యరథం): అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. బుధవారం అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలతో ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు జేసి అస్మిత్‌రెడ్డి, గుమ్మనురు జయరాం, బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. అర్బన్ నియోజకవర్గంలో జరుగుతున్న పనులకు సంబంధించి ఎమ్మెల్యే దగ్గుపాటి సీఎం చంద్రబాబుకి వివరించారు. తర్వాత ఆయన్ని ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో నడిమివంక, మరువవంకలకు ప్రొటెక్షన్ వాల్స్‌కి సంబంధించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారీవర్షాల సమయంలో ఈ వంకలు పొంగి చాలా కాలనీలు నీట మునుగుతున్నాయని.. అందుకే వీటికి రక్షణ గోడలు నిర్మించాలన్నారు. ఇందుకు సంబంధించి జల వనరులశాఖ రూ.79.46కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. అలాగే నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు 2023లో రూ.25కోట్లు అంచనా పనులు చేపట్టారన్నారు. అప్పట్లో కేవలం రూ.6.165కోట్లు మంజూరు చేశారన్నారు. మిగిలిన రూ.18.84 కోట్లతో రోడ్లు, రక్షితనీటి సరఫరా, వీధిలైట్లు, టాయిలెట్ సౌకర్యాలువంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వాటికి సంబంధించిన నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నగర శివారులోని శిల్పారామాన్ని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన అక్కడ చాలా సమస్యలు నెలకొన్నాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఇక్కడ మరమ్మతులు, పరికరాల భర్తీ, పార్కులో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.9.95కోట్లు కేటాయించాలని కోరారు. మరోవైపు అనంతపురం నియోజకవర్గానికి సంబంధించి కూడేరు మండలం ముద్దలాపురంలో 16ఎకరాల భూమి ఉందని.. అక్కడ సోలార్ పార్కు ఏర్పాటుకు రూ.16 కోట్ల రూపాయులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అన్నింటికీ సంబంధించిన ప్రతిపాదన పత్రాలను కూడా సీఎంకు అందజేశారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీటికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



## లడ్డూ కల్తీ నివేదికలు తొక్కిపట్టారు

**తిరుమలపై మహావిషం చిమ్ముతున్నారు: మండలిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

అమరావతి (చైతన్యరథం): తిరుమల విషయంలో క్షమించారని కుట్ర జరిగిందని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఏపీ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని నివేదికలన్నీ చెబుతున్నా.. వైకాపా సభ్యులు దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూపై స్టేట్మెంట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. మత విశ్వాసాలు దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2019–2024 మధ్య నెయ్యి విషయంలో కుట్రలు చేశారని సీబీఐ ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. అయినా తిరుమలపై మహా విషం చిమ్ము తున్నారని మండిపడ్డారు. "జగన్ నాయకత్వంలో నివేదికల ను తొక్కి పెట్టిన విషయం అందరికీ తెలుసు. టెండర్లన్నీ మార్చి నిబంధనలను తుంగలో తొక్కారు. తమకు అనుకూలంగా నిబంధ నలను మార్చుకున్నారు. కల్తీ జరగడం వాస్తవమేనని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్రెడ్డి ఒప్పుకొన్నారు కదా. ఆనాటి తితిదే చైర్మ న్లే ఒప్పుకున్నప్పటికీ.. వైకాపా నేతలు మాత్రం ఒప్పుకోవడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గందరగోళ పరిస్థితి తలెత్తడంతో మండలి చైర్మన్ మోషేను రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

## అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదు

**- నోటీసులకు తగిన సమయం రావాలి**
**- గవర్నర్ ప్రసంగం రోజు వస్తే హాజరు కాదు**
**- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**



అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యానించారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో స్పీకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారు. అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని తెలిపారు. వైసీపీలో జగన్‌రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలి.. అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్‌లో సక్సెస్ అయితే దేశ వ్యాప్తంగా సక్సెస్ అవుతుందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబం ధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని ప్రశ్నించారు.

## ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): ఉద్యోగులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వారి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను గురువారం ఆమె రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో ఉద్యోగులదే ప్రధాన పాత్ర అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను వేధిస్తే కూటమి ప్రభుత్వం వారిని అక్కున చేర్చుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జీతాల కోసం వేచి చూడాల్సి వచ్చేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. అనంతరం బీసీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగ సంఘ నేతలు మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వి.అనురాధ, వి.గుణవంతుడు, సురేశ్, సతీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శరవేగంగా పోర్టుల అభివృద్ధి

**మండలిలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఎమ్మె ల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, బీటీ నాయుడు, బీద రవిచంద్ర అడిగిన ప్రశ్నలకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని ఉన్న ఏకైక మేజర్ పోర్ట్ అయిన విశాఖ పోర్టు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యం లో 141.6 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పనిచేస్తోంది. నాన్-మేజర్ పోర్ట్‌లు గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ డీప్ వాటర్ పోర్టులు మారిటైమ్ బోర్డు నియంత్రణలో పీపీపీ మోడల్‌లో నిర్వహించ బడుతున్నాయని వెల్లడించారు. అదానీ గంగవరం పోర్టు 64 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో, కాకినాడ డీప్ వాటర్ పోర్టు 26 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో, కృష్ణపట్నం పోర్టు 98 ఎంఎం టీపీఏ సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. నాన్-మేజర్ పోర్ట్ హోలు కాకినాడ యాంకరేజ్ పోర్ట్, కోనసీమ జిల్లాలోని రవ్వా పోర్టులు ఏపీ మారిటైమ్ బోర్డు నిర్వహణలో ఉన్నాయి. కాకినాడ యాంకరేజ్ పోర్టు 5 ఎంఎంటీపీఏ సామర్థ్యం, రవ్వా పోర్టు 2 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఈపీసీ విధానంలో రామాయపట్నం, మచిలీపట్నం, మూలాపేట (3) గ్రీన్ ఫీల్డ్ పోర్టులు ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్నాయి. రామాయ పట్నం పోర్టు 24-04-2026, మచిలీపట్నంలో పోర్టు 28-12-2026, మూలపేట పోర్టు 30-11-2026 తేదీ నాటికి పూర్తి కానున్నాయని తెలిపారు. పీపీపీ మోడల్ బూట్ (బిల్డ్, ఓన్, ఆఫరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో తూర్పుగోదావరి జిల్లా కోన గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ కమర్షియల్ పోర్టు అభివృద్ధి చేస్తున్నాం. జూలై 20 నాటికి ఇది పూర్తి కానుందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఈ పోర్టులన్నీ అవి పూర్తయిన తేదీ నుంచి 6 - 9 నెలలలో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. ల్యాండ్ లార్డ్ మోడల్‌లో నిర్మిస్తున్న మూలాపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు రైలు-రోడ్డు కనెక్టివిటీకి అవసరమైన భూమి, నిర్మాణ ఖర్చులను ఏపీ మారిటైమ్ బోర్డ్ సమకూరుస్తోంది. పీపీపీ విధానంలో నిర్మి స్తున్న కాకినాడ సెజ్ పోర్టు విషయంలో ఎన్‌హెచ్ 16కి రోడ్డు అనుసంధానం ఎన్‌హెచ్ ఏఐ అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీదారుడి ఖర్చుతో రైలు అనుసంధానానికి భూసేకరణకు వీలు కల్పిస్తోందని తెలిపారు.

**సమిశ్రగూడెం శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి**

# రూ.1.25 కోట్లు మంజూరు

- **గోదావరి పుష్కరాలు-2027 నేపథ్యంలో పరిపాలన అనుమతులు జారీ చేసిన దేవదాయ శాఖ**
- **పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం**



నిడదవోలు (చైతన్యరథం): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవతో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రూరల్ మండలంలోని సమిశ్రగూడెం శ్రీ పర్వతవర్ధినీ రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి మార్గం సుగమమైంది. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఉమ్మడి ప్రయోజన నిధి ('కామన్ గుడ్ ఫండ్') కింద ఈ దేవాలయ పునర్నిర్మాణానికి రూ.1.25 కోట్లు నిధులు మంజూరు చేస్తూ దేవదాయ శాఖ పరిపాలన అనుమతులు జారీ చేసింది.


రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో దేశవ్యాప్తంగా భక్తులు రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లోని పవిత్ర గోదావరి తీరానికి తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులు స్నానం ఆచరించిన అనంతరం నదీ తీరంలోని పురాతన దేవాలయాలను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, దేవాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవదాయ శాఖ ప్రత్యేక సర్వే నిర్వహించింది. సర్వే నివేదికల ఆధారంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన సమిశ్రగూడెం ఆలయ పునరుద్ధరణ, ఫేస్‌లిఫ్ట్ పనుల కోసం మంత్రి కందుల దుర్గేష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి త్వరితగతిన నిధులు మంజూరు చేయించారు.

నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన నియోజకవర్గ ప్రజలు మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. "పుష్కరాల నాటికి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి పంచేలా ఆలయ రూపురేఖలు మార్చడమే మా లక్ష్యం. నిర్మాణ పనులను పుష్కరాల కంటే నాలుగైదు నెలల ముందే పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి" అని ఆదేశించారు.

# ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం

- **కట్టకుండానే గత ప్రభుత్వంలో బిల్లులు చేశారు**
- **త్వరలో విశాఖ, విజయవాడ మెట్రో పనులు**
- **అసెంబ్లీలో మంత్రి పొంగూరు నారాయణ**
- **రూ.14,538 కోట్లతో పురపాలక బడ్జెట్**

అమరావతి(చైతన్యరథం): ఏపీలోని నగరాలు, పట్టణాల్లో జనా భా ప్రస్తుతం 36 శాతం ఉండగా, 2047 నాటికి 60 శాతానికి చేరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. దీనికి తగినట్లుగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. గురు వారం ఏపీ శాసనసభలో పురపాలకశాఖ బడ్జెట్ రూ.14,538 కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెత్త సేకరణ, నిర్వహణ, నీటి పునర్వినియోగం, ప్రతిఒక్కరికీ ఇళ్లు, రోడ్లు, ఆసుపత్రులు, శ్మశా నాలు వంటి అంశాలపై దృష్టి సారించామని వివరించారు. ప్రస్తు తం నగరాలు, పట్టణాల్లో 2100 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. గతంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని 2.65 లక్షలకు కుదించి రంగులు మార్చిందన్నారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు చేసిందని విమర్శించారు. ప్రస్తుతం రూ.4,451 కోట్లు హడ్కో రుణం మంజూరైందని.. ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తామని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేశామన్నారు. వివిధ శాఖల ఎన్‌ఓసీలను సింగిల్ విండో విధానంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిం దని.. తణుకులో రూ.691 కోట్లు, తిరుపతిలో రూ.147 కోట్లు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ తర్వాత సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. రాజధాని అమరావతిని వైసీపీ మూడుముక్క లాటతో నాశనం చేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ల పాత బిల్లులు క్లియర్ చేశామని, మళ్లీ కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించామని తెలిపారు. వర్షాలు ముగిసిన తర్వాత పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు ఈ నెలలో పూర్తవుతాయని తెలిపా రు. మిగతా అధికారుల భవనాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. మున్సిపాలిటీలకు పన్నుల రూపంలో వచ్చిన రూ. 3,500 కోట్లను వైసీపీ దారి మళ్లించిందని ఆరోపించారు. ప్రస్తు త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్ను డబ్బులను సంబంధిత మున్సిపాలిటీల్లోనే ఖర్చు చేసుకునేందుకు అనుమతించామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో పనులు త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆపై మున్సిపల్ బడ్జెట్ గ్రాంట్లను శాసనసభ ఆమోదించింది.



చైతన్యరథం

## దువా మరణం
## పాత్రికేయ రంగానికి తీరని లోటు

**- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి**



అమరావతి(చైతన్యరథం): సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ దౌత్యవేత్త, పార్లమెంటేరియన్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత హరి కృషన్ దువా మృతికి గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి సంతాపం వ్యక్తం చేస్తున్నాను. నాలుగు దశాబ్దాలకు పైగా ఉత్తమ జర్నలిస్టుగా సాగిన ఆయన ప్రస్థానం, హిందుస్తాన్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ట్రిబ్యూన్ వంటి ప్రతిష్ఠాత్మక పత్రికలకు ఎడిటర్‌గా పాత్రికేయ రంగానికి ఆయన చేసిన అమూల్యమైన సేవకు నిదర్శనం. ప్రధానమంత్రి మీడియా సలహాదారుగా, రాయబారిగా, రాజ్యసభ సభ్యునిగా ఆయన నిర్వహించిన వివిధ ఉన్నతమైన బాధ్యతలు, దేశానికి ఆయన అందించిన సేవలను చాటి చెబుతాయి. ఆయన రచనలు, విశ్లేషణలు భారతీయ రాజకీయాలు, అంతర్జాతీయ వ్యవహారాలపై లోతైన అవగాహనకు నిదర్శనం. ఆయన మృతి పాత్రికేయరంగానికి, దేశానికి తీరని లోటని.. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## మహిళా రక్షణ పోస్టర్ల ఆవిష్కరణ

**పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ**



అమరావతి(చైతన్యరథం): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారు మహిళల రక్షణ చట్టాలపై రూపొందించిన పోస్టర్లను గురువారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కార్యాలయంలో ఆవిష్కరించారు. పోస్టర్ల విడుదల అనంతరం శైలజ మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలపై ప్రజల్లో మరింత అవగాహన రావాలని అన్యాయానికి గురైన మహిళలు వెంటనే ఫిర్యాదులు చేసే విధంగా చట్టాలను తెలియచెప్పాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు సేవతో పాటు చట్టాలను గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులకు వివరించి చైతన్య పరచాలన్నారు. మహిళా భద్రత సంరక్షణ ఏ ఒక్కరి బాధ్యత కాదని అది మనందరి సమిష్టి బాధ్యతన్నారు. బాల్యవివాహాలు, టీనేజీ గర్భాల వల్ల జరిగే అనర్థాలను పోస్టర్లు, వీడియోలు, ఇతర ఇతర దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా ప్రజల లోకి విస్తృతంగా తీసుకుపోవాలన్నారు. మహిళల రక్షణ, సంరక్ష ణకు సేవ చేయాలనుకునే స్వచ్ఛంద సేవా సంస్థలకు మహిళా కమిషన్ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు.

**మద్యం కుంభకోణం కేసులో**

## ప్రణయ్ ప్రకాష్‌కు రిమాండ్

అమరావతి (చైతన్యరథం): ఏపీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఏ-52 ప్రణయ్ ప్రకాష్ రిమాండ్ రిపోర్టులో సీఐడీ సంచలన విషయాలు వెల్లడించింది. నిందితుడు కట్టా ప్రణయ్ ప్రకాష్‌ను నేపాల్ సరిహద్దులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్ రిపోర్టులోని అంశాలివీ..మద్యం కుంభకోణంలో సుమారు రూ.3,200 కోట్ల అక్రమ లాభాలు ఆర్జించారు. మాన్యువల్ ఓఎఫ్ఎస్ విధానం ద్వారా ప్రముఖ మద్యం బ్రాండ్లను మార్కెట్ నుంచి అధికారులు తొలగించారు. కిక్‌బ్యాక్‌లు ఇచ్చిన కంపెనీలకే అనుకూలంగా మద్యం సరఫరా ఆర్డర్లు కేటాయించారు. మద్యం సిండికేట్ బ్రాండ్లను బలవంతంగా అమ్మేందుకు ప్రభుత్వ దుకాణాల సిబ్బందిని ప్రణయ్ ప్రకాష్ బెదిరించాడు. తాడేపల్లిలోని అపార్ట్‌మెంట్‌లో సేఫ్ హౌస్ ఏర్పాటు చేసి వందల కోట్ల నగదు నిల్వ చేశాడు. 2004 ఎన్నికల కోసం మద్యం సిండికేట్ నుంచి వచ్చిన సొమ్మును వివిధ ప్రాంతాలకు తరలించినట్లు సాక్ష్యాలు లభ్యమయ్యాయి. డిస్టిలరీల నుంచి సిండికేట్ సభ్యులు రూ.150 నుంచి రూ.600 వరకు కేస్ వారీగా లంచాలు వసూలు చేశారు. షెల్ కంపెనీలు, బంగారు నగల వ్యాపారుల ద్వారా నల్లధనాన్ని వైట్ మనీగా మార్చినట్లు సీఐడీ నిర్ధారించింది. అదాన్ డిస్టిలరీస్ పేరుతో బినామీ కంపెనీని ఏర్పాటు చేసి వేల కోట్ల లావాదేవీలు జరిపినట్లు వెల్లడించింది. ప్రభుత్వ ఖజానాకు భారీ గండికొడుతూ మద్యం ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచినట్లు రిపోర్ట్‌లో అధికారులు పేర్కొన్నారు. దుబాయ్, థాయ్‌లాండ్ మీదుగా ఆఫ్రికాకు పారిపోయిన నిందితుడు ప్రణయ్‌ప్రకాష్,. తిరిగి వస్తుండగా అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నిందితుడిని మార్చి 19వ తేదీ వరకు జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

## విస్తరణలో తొలగించిన చెట్లను పరిరక్షిస్తాం
# వాటి తరలింపునకు ప్రత్యేక పాలసీ

- **కొత్త జిల్లాల్లో జిల్లా పరిషత్ కార్యాలయాలు**
- **అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్**



అమరావతి (చైతన్యరథం): రహదారుల పక్కన ఉన్న భారీ వృక్షాలను విస్తరణ సమయంలో తొలగించి వాటిని వేరే ప్రాంతా నికి తరలించడానికి ప్రత్యేక పాలసీ తీసుకువస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. వాటిని వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రత్యేక పాలసీ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. నెలరోజుల్లోనే ఈ విషయంపై సానుకూల నిర్ణయం వస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ బడ్జెట్ రూ.15,485 కోట్లు, గ్రామీణా భివృద్ధి శాఖ రూ.11,217 కోట్లు, అటవీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు రూ.713 కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో ప్రవేశపె ట్టారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. కొత్త జిల్లాల్లో జిల్లా పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లోపు ఈ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపైనా దృష్టి పెడతామని తెలిపారు. మొక్కలకు జియో ట్యాగింగ్ విషయం ప్రయోగాత్మ కంగా అమలు చేస్తున్నామని వివరించారు. పట్టుబడిన ఎర్రచంద నం విక్రయంపై మంత్రివర్గ ఉపసంఘం త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఏపీలో మూడు వేల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు సకాలంలో ఇచ్చామని పేర్కొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

- **వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాం**
- **24 గంటలు అందుబాటులో స్టాఫ్ నర్సులు**
- **ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్యాధికారి**
- **అసెంబ్లీలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**



అమరావతి(చైతన్యరథం): సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో భద్రత, సౌకర్యాలపై విష్ణుకుమార్‌రాజు ప్రశ్నకు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సమాధానమిచ్చారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో 1,04,000 మంది విద్యార్థులు ఉన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థుల కోసం 52 వేల పడకలు కావాల్సి ఉంది..దశలవారీగా మంచాలు సమకూర్చే విషయం పరిశీలిస్తున్నాం. వసతిగృహాల్లో 96,159 మంది విద్యార్థులు ఉన్నారు..విద్యార్థులకు 700 మాత్ర మే ఉన్నాయి.. 95,459 మంచాలు అవసరం. పాత భవనాలు కాబట్టి మంచాలు ఉంచే వెసులుబాటు లేదు. అధ్యయనం చేసి మంచాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచిం చారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు మంచాల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. విశాఖ జిల్లా గాజువాక, పెందుర్తిలో నూత న హాస్టల్ భవనాలు మంజూరు చేస్తాం. స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు అదనపు మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. కూటమి పాలనలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధపెట్టాం. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు ప్రభుత్వ మే సంరక్షకుల మాదిరిగా ప్రత్యేక చొరవతో వైద్యం అందిస్తోంది. శ్రీకాకుళం జిల్లా కొల్లివలస అంబేద్కర్ గురుకుల విద్యార్థి తీవ్ర అనారోగ్యానికి గురైతే రూ.16 లక్షలతో వైద్యం అందించి ప్రాణా లు కాపాడాం. థైరాయిడ్‌కి గురైన 80 మంది, మూర్ఛ వ్యాధి ఉన్న 54 మంది, అపెండిక్స్ విద్యార్థులు 45 మందిని గుర్తించి చికిత్స అందిస్తు న్నాం. క్యాన్సర్ బారిన పడిన నలుగురు విద్యార్థులకు చికిత్స వైద్యం అందించి ప్రాణాలు కాపాడాం. సీఎం చంద్రబాబు అడుగు జాడల్లో పనిచేస్తూ పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పన, బంగారు భవిష్యత్తుకు కృషి చేస్తున్నామని వివరించారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, అంబేద్కర్ గురుకులాల్లో అనారో గ్యానికి గురైన 36 మంది విద్యార్థులకు ప్రత్యేక చొరవతో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాం. సమర్థవంతమైన స్క్రీనింగ్ పద్ధతు ల ద్వారా విద్యార్థుల్లో రక్తహీనతతో పాటు పలు వ్యాధులను గుర్తిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్య అవసరాల కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా స్టాఫ్ నర్సులను నియమించామని చెప్పా౦. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉమ్మడి జిల్లాకొక ప్రత్యేక వైద్య అధికారిని నియమించాం. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. సాంత్వన ద్వారా విద్యార్థుల అత్యవసర ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. పరిశుభ్రత ఆహారం కోసం స్టాండర్డ్ ప్రొసీజర్స్ జారీ చేశామని తెలిపారు.

# అంగన్‌వాడీ భవనాల పూర్తికి చర్యలు

- **రూ.193.92 కోట్లతో ప్రతిపాదనలు**
- **62 ఏళ్లు పూర్తయిన కార్యకర్తలకు గ్రాట్యుటీ**
- **త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం**
- **అసెంబ్లీలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 14వ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం శాసన సభలో అంగన్‌వాడీల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా పాక్షికంగా పూర్తయిన అంగన్‌వాడీ భవనాల అంశంపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రశ్నించారు. దీనికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమాధానం ఇచ్చారు. ఏపీ వ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 21,756 సొంత భవనాలు, 10,556 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని వివరించారు. 23,424 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని... వాటిని అమలు చేస్తు న్నామని, వాటిలో కొన్ని భవనాలు నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. 2922 భవనాల నిర్మాణాలను అమలు చేశామని.. వీటిలో 948 అంగన్‌వాడీ భవనాలు పూర్తి దశలో ఉన్నాయని.. వాటికోసం రూ.4కోట్లు విడుదల అయ్యాయని చెప్పుకొచ్చారు. రూ.193 కోట్లు ఉంటే అన్ని అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయ గలుగుతామని తెలిపారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 62 సంవత్సరాలు పూర్తయితే వారికి గ్రాట్యూటీ ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పుడు అంగన్‌వాడీలకు స్టేషన్ రికగ్నిజైషన్ ఉండటంతో అందరూ సెంటర్లకు వస్తున్నారని పేర్కొన్నారు. 'ముస్తాబు' కార్యక్రమంతో అంగన్‌వాడీల్లోని పిల్లలు కూడా చక్కగా చదువు కొంటున్నారని వివరించారు. 547 కేంద్రాలు రిపేర్లలో ఉన్నాయ ని, 9240 కేంద్రాల్లో టాయిలెట్స్, 11,400 కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించామని అన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లల హాజరు.. గతంలో 70 శాతం ఉంటే.. ఇప్పుడు 93 శాతం ఉందన్నారు. దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఏపీ ఉందని చెప్పుకొచ్చారు.

**అంగన్‌వాడీలకు జీతాలు పెంచాం..**

అంగన్‌వాడీలకు గతంలో రూ.4200 జీతం ఉండేదని కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11,500 జీతం పెంచామని తెలిపారు. తమ ప్రభుత్వం అంగన్‌వాడీలకు మూడు సార్లు జీతం పెంచిందని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీలు పది డిమాండ్లు అడిగితే వాటిలో 9 పూర్తి చేశామని తెలిపారు. రూ.75 కోట్లతో 5జీ ఫోన్లను అంగన్‌వాడీలకు ఇచ్చామని వివరించారు. జనాభా ప్రాతిపదికన కొత్త అంగన్‌వాడీలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంగన్‌వాడీల అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మాటిచ్చారు.

# మగ్గంతో నేసే చేనేత వస్త్రాలనే కొనుగోలు చేస్తాం

- నేతన్నలకు ఎంతో మేలు జరుగుతుంది
- ఏడాది పాటు ఉపాధి లభించే అవకాశం
- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- ఎమ్మెల్యేలు, అధికారులతో కీలక భేటీ
- రూ.1.40 కోట్ల విలువైన వస్త్రాల కొనుగోలు



అమరావతి(చైతన్యరథం): మగ్గం మీదే నేసే వస్త్రాలను మాత్రమే ఆప్కో ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఆప్కో బ్రాండ్ మరింత పెంచేలా షో రూమ్‌లలో నాణ్యమైన చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించ నున్నామని తెలిపారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో చేనేత, జౌళి శాఖాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రూ.కోటీ 70 లక్షల విలువైన చేనేత వస్త్రాలను ఈ సమావేశానికి చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొ చ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు, కేవలం మగ్గంపైనే నేసిన రూ.1.40 కోట్ల విలువైన చేనేత వస్త్రాలను అక్కడికక్కడే కొనుగోలు చేశారు. రాష్ట్రంలో చేనేతరంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆప్కో బ్రాండ్‌ను మరింత విస్తరించే క్రమంలో ఆయా షోరూమ్‌లలో కేవలం మగ్గం మీద నేసే చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించనున్నామని తెలిపారు. పవర్‌లూమ్ మగ్గాల మీద నేసే వస్త్రాలను ఆప్కో షో రూమ్‌లలో విక్రయించేది లేదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల నేతన్నలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏడాది పాటు ఉపాధి లభించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇకపై ఆప్కో ఇమేజ్ పెంచేలా నేటి ట్రెండ్‌కు అనుగుణంగా నేతన్నలు చేనేత రెడీమేడ్ దుస్తుల తయారీపైనా దృష్టి పెట్టాలని కోరారు. ఆసక్తి కలిగిన వారికి ఉచిత శిక్షణ సైతం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ కామర్స్ ద్వారా ఆన్‌లైన్ అమ్మకాలు ప్రారంభించామని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వెల్లడించారు.

**చేనేత సమస్యలపై కీలక భేటీ**

ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, జోగేశ్వరరావు, కృష్ణప్రసాద్, షాజహాన్ బాషాతో పాటు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అధికారులతో మంత్రి సవిత గురువారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో భేటీ అయ్యారు. 20 నెలల కాలంలో చేనేతల అభివృద్ధికి చేపట్టిన పథకాలను వివరించారు. నూతన టెక్స్ టైల్స్ విధానం రూపకల్పనతో రాష్ట్రంలో చేనేత రంగానికి కొత్త శకం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్యకార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి తదితరులు పాల్గొన్నారు.



## 8న ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంఓయూలు
- నాలుగు ఎన్‌ఆర్‌ఎల్‌ఎం క్లస్టర్ల ప్రారంభం
- డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ
- మహిళా లబ్ధిదారులకు వాహనాలు
- మంత్రులు సవిత, సంధ్యారాణి వెల్లడి

అమరావతి(చైతన్యరథం): ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు ఎస్.సవిత, గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని పరేడ్స్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ వేడుకల్లో మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంవోయూలు చేసుకోనున్నట్లు వివరించారు. అమరావతి సచివాలయంలో సెర్ప్, చేనేత, జౌళి శాఖ, సీఆర్డీయే, గుంటూరు జిల్లా అధికారులతో గురువారం వారు సమావేశం నిర్వహించారు. అమరావతి పరేడ్స్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహి ళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ వేడుకలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపా రు. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరు కానున్నారని వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు మేలు కలిగేలా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో పలు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం సమక్షంలో 36 ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలతో ల్యాప్‌టాప్ బ్యాగులు, క్యారీ బ్యాగులు, రెడీమేడ్ దుస్తుల తయారీకి శిక్షణ ఇవ్వడదానికి సెర్ప్‌తో ఆప్కో ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. సీఎం చేతులమీదుగా నాలుగు ఎన్‌ఆర్‌ఎల్‌ఎం క్లస్టర్ల ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు(కర్నూలు), చీరాల(బాపట్ల), రాజాం(విజయనగరం), పొందూరు (శ్రీకాకుళం) లో ఈ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. మహిళా దినోత్స వేడుకల సందర్భంగా 23 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా డ్వాకా మహిళా సంఘాలకు రుణాల అందజేయనున్నామన్నారు. మిల్లెట్ కార్ట్ లు 2, ఎగ్ కార్ట్ లు 5, రైతు బజారు వ్యాన్ 1, బొలెరో వాహనాలు రెండు, ఆటోలు 5, ట్రాక్టర్లు 5, ర్యాపిడో ద్విచక్ర వాహనాలు 5 మహిళ లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సీఆర్డీయే అడిష నల్ కమిషనర్ భార్గవ్ తేజ, గుంటూరు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలపై సానుకూలంగా ఉన్నాం

- దహన సంస్కారాల చెల్లింపు పరిశీలనలో ఉంది
- త్వరగా కొత్త ఫోన్లు, యూనిఫాంలు ఇచ్చేలా చర్యలు
- సమస్యలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తా
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ



అమరావతి(చైతన్యరథం): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కా రంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ముఖ్య ప్రతినిధులతో సచివా లయంలోని తన ఛాంబరులో గురువారం సాయంత్రం సమావే శమై వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశాల పనితీరు సంతృప్తికరంగా ఉందని, క్షేత్రస్తాయిలో వైద్య సేవలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచిందన్నారు. ప్రసూతి సెలవులు 6 నెలలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ కూడా ఇస్తున్నామని తెలిపారు. ఆశాల పనితీరు ను గుర్తించి, వారి నుంచి అభ్యర్థనలు రాక మునుపే ప్రభుత్వం సానుకూల ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వా నికి మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు.

**1,234 ఆశాల ఖాళీలను భర్తీ చేశాం**

దహన సంస్కారాల కింద రూ 15,000 చెల్లించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులకు మాదిరిగా సాధారణ సెలవులు మంజూరు విషయమై జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాలు అనుసరించి చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. అశాల విజ్ఞప్తి మేరకు కొత్త చరవాణులు, రెండు చీరెలను (జార్జటు మెటీరియల్) ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన జాబు చార్టు ప్రకారమే విధులు నిర్వర్తిం చేలా జిల్లాలకు ఆదేశాలు పంపుతామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఆశాల ఖాళీలను 1,363 భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గడిచిన 20 నెలల్లో 1,234 అశాల ఖాళీలను భర్తీ చేసిన విషయాన్ని ప్రతినిధులకు గుర్తు చేశారు. బీమా సౌకర్యం వర్తింపచేయడంలో సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు. ఆశాల సమస్యల గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని వారికి వివరించారు.

**ప్రభుత్వ నిర్ణయాలపై సంతోషంగా ఉన్నాం: ఆశా ప్రతినిధులు**

ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఇతర ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు పెంపు, ప్రసూతి సెలవుల మంజూరు, గ్రాట్యూటీ చెల్లింపులపై ఉత్తర్వులు ఇవ్వడంపట్ల ఆశా లు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రసూతి సెలవులు మహిళల కు బాగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఆశాలకు కనీస వేతనం చెల్లించాలని, జాబుచార్టు ప్రకారమే విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న ఆశాల పోస్టులు భర్తీ చేయాలని, బీమా సౌకర్యాన్ని కల్పించాలని మంత్రికి విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ఆశాల విధుల పర్యవేక్షణ అధికారి, సీఏఓ ప్రకాష్ రావు, మరో సీనియర్ అధికారి శ్యామల కూడా పాల్గొన్నారు.

## కస్టోడియల్ టార్చర్ కేసు..
## తొలిరోజు ముగిసిన సునీల్‌నాయక్ విచారణ



గుంటూరు(చైతన్యరథం): బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి ఎం.సునీల్‌నాయక్ గురువారం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. వైకాపా హయాంలో సీఐడీ కస్టడీలో ఉండగా అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో ఆయన హాజ రయ్యారు. గుంటూరులోని సీసీఎస్ పీఎస్‌లో విచారణ జరిగింది. సునీల్ నాయక్‌ను దర్యాప్తు అధికారిగా ఉన్న విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో దాదాపు 7 గంటల పాటు విచారించారు. ఈనెల 9వ తేదీ వరకు విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. రఘురామకృష్ణరాజు నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు 2021 మేలో హైదరాబాద్‌లోని ఆయన నివా సంలో అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయా నికి తరలించారు. అరెస్టు చేసిన రోజు రాత్రంతా సీఐడీ కార్యాల యంలోనే ఉంచారు. అప్పట్లో సీఐడీ డీఐజీగా పనిచేసిన సునీల్ నాయక్... ఆ రోజు రాత్రి పలుమార్లు గుంటూరు సీఐడీ ప్రాంతీ య కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. ఆయన్ను ఈ కేసులో ఏడో నిందితుడిగా (ఏ–7) చేర్చారు. ఈ కేసులో విచా రణకు రావాలంటూ సునీల్ నాయక్‌కు పలుమార్లు నోటీసులిచ్చినా హాజరుకాలేదు. బిహార్‌లోని పట్నాకు వెళ్లి అరెస్టు చేసినా.. ట్రాన్సి ట్ వారెంట్ రాకపోవడంతో ఏపీకి తీసుకురాలేకపోయారు. ఆ తర్వాత ఆయన ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టులో పిటిష న్ వేయగా.. దర్యాప్తు అధికారి ఎదుట విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయన తప్పనిసరిగా విచారణకు హాజరు కావాల్సి వచ్చింది.

# కుందూ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్

**- ప్రాధాన్యతల ఆధారంగా పరిశీలిస్తాం**

**- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు**



అమరావతి (చైతన్యరథం): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజక వర్గానికి సంబంధించి కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని నీటి ఎద్దడి నివారణకు కుందూ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదన పరిశీలిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అసెంబ్లీలో గురువారం సభ్యురాలు భూమా అఖిల ప్రియ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, దోర్నిపాడు మండలా ల్లో విస్తరించి ఉన్న కేసీ కెనాల్ ఆయకట్టుకు మార్చి, ఏప్రిల్ నెలల్లో నీటి ఎద్దడి ఎదురవుతున్న మాట వాస్తవమేనని మంత్రి చెప్పారు. అందుకు గల కారణాలు కూడా వివరించారు. కృష్ణా వాటర్ డిస్ట్రిబ్యూషన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం కేసీ కెనాల్‌కు 39.90 టీఎంసీల నీరు విడుదలవుతుందన్నారు. అందులో తిరిగి ఎస్‌ఆర్‌బీసీకి 8 టీఎంసీల నీరు తీసుకోవడం వల్ల 31.90 టీఎం సీల నీరు మాత్రమే కేసీ కెనాల్‌కు నికరంగా లభ్యమవుతుందన్నా రు. అలాగే కేసీ కెనాల్‌కు నిరందించే సుంకేసుల జలాశయం సామర్థ్యం కూడా 1.24 టీఎంసీలు మాత్రమే కావడం వల్ల నీటి నిల్వ కష్టమవుతుందన్నారు. అలాగే కేసీ కెనాల్ ఆయికట్టు పునర్విభజన తర్వాత కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలు కలిపి 2,65,628 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో ఒక్క నంద్యాల జిల్లాలోనే 1,69,745 ఆయకట్టు ఉంది. సభ్యులు అడిగిన ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి ఖరీఫ్‌లో 49,245 ఎకరాలకు నీరు అందించగలుగుతున్నాం. రబీలో మాత్రం 39024 ఎకరాలకే నీరు అందుతుంది. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన అనుమతికి మించి అదనపు విస్తీర్ణం సాగు చేయడం, సహజసిద్ధంగా రబీలో ఏర్పడే నీటి ఎద్దడి తదితర కారణాల రీత్యా, సభ్యులు చెప్పినట్లు కుందు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదన పరిశీలిస్తాం, ప్రాధాన్య క్రమంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

## రూ.6 వేల కోట్లతో

# 200 సబ్‌స్టేషన్ల నిర్మాణం

- **విద్యుత్ సరఫరా ఆటంకం లేకుండా చర్యలు**
- **పరిశ్రమల రాకతో పెరుగుతోన్న డిమాండ్**
- **అధిక లోడ్ ఉన్న చోట లైన్లు, పవర్ స్టేషన్లు**
- **విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్టు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, ముత్తుముల అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200 కు పైగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ల అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు.

విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీ టెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో



రూ.46 కోట్ల వ్యయంతో 220 కేవీ, 132 కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో రూ.77 కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు.

విజయనగరంలో కూడా విశాఖప ట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరగా ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకున్నదని తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజక వర్గంలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తు ముల అశోక్‌రెడ్డి కోరగా..విద్యుత్ శాఖ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఆధారం గా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

### విద్యుత్ వినియోగం పెరిగింది

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని తెలిపారు. దీంతో రోజువారీ విద్యుత్ వినియో గం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్ల కు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగు తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రా మిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింద ని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుం డా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.

# వైసీపీ నేతల భూ కబ్జా

- **వైసీపీ వైస్ ఎంపీపీ అనుచరుల అక్రమ పర్వం**
- **ప్రభుత్వ స్థలానికి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్**
- **రీ-సర్వే పూర్తయినా ఆన్‌లైన్‌లో ఎక్కని భూమి... న్యాయం చేయాలంటూ వినతి**
- **అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏపీ కొప్పులవెలమ వెల్ఫేర్, డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్**

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏపీ కొప్పులవెలమ వెల్ఫేర్, డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ అర్జీలు స్వీకరించారు.

నంద్యాల జిల్లా పాణ్యం మండలం చిలుకల గ్రామానికి చెందిన కదిరి రామచంద్రుడు అభ్యర్థన ఇదీ... మా గ్రామంలోని సర్వే నెం.172లో నాకు విక్రయరీత్యా మొత్తం 5.33 ఎకరాల (4.63o0.70) భూమి సంక్రమించింది. దీనిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఇటీవల జరిగిన రీ-సర్వేలో ప్రభుత్వం ఈ భూమిని జాయింట్ ఖాతా కింద మార్చి లెక్కల్లో గందరగోళం సృష్టించింది. జాయింట్ ఖాతాలను విడగొట్టాలని ప్రభుత్వం ఆదేశించినా స్థానిక సర్వేయర్లు పట్టించుకోవట్లేదు. నంద్యాలకు చెందిన వైసీపీ నాయకులు ద్వారం రమణారెడ్డి, అనంతశయనారెడ్డి ప్రోద్బలంతో వారి అనుచరులు నా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి పైరు నాటారు. దీనిపై ఫిర్యాదులు చేసినా, సర్వే కోసం చలానా కట్టినా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. పైగా రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకే సహకరిస్తున్నారు. నా భూమిని నాకు ఇప్పించాలని కోరుతూ పొలం దగ్గరకు వెళ్తే అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిస్తామని సదరు నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని నా సమస్యను పరిష్కరించండి.

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన మునిపల్లి బుజ్జి అర్జీ ఇదీ... 2008లో ప్రభుత్వం పేదలకు నివాస స్థలాల కోసం సర్వే నెం.874లో గూడవల్లి బసవయ్య నుంచి 47 సెంట్లు, వసంతాడ సాంబశివరావు నుంచి 72 సెంట్లు కలిపి మొత్తం 1.19 ఎకరాల భూమిని సేకరించింది. దీనిని 42 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాల రూపంలో పంపిణీ చేశారు. కొందరు లబ్ధిదారులు అక్కడ తాత్కాలిక నివాసాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చాక ఘంటసాల మండల ఉపాధ్యక్షుడు కుంపటి నాగేంద్రబాబు... అతడి అనుచరులు గూడవల్లి బసవయ్య, ఏడుకొండలు, నాగరాజు, గొరిపర్తి రామచంద్రరావు, చావలి కృష్ణ కిషోర్ కలిసి ఒక పథకం ప్రకారం 2020 జూలై 27న మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ పార్టిషన్ డీడ్ (విభజన పత్రం) సృష్టించారు. ప్రభుత్వం సేకరించిన సర్వే నెం. 874లోని 10 సెంట్లు భూమిని తమ సొంత భూమిగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్టర్ చేయించి ఆక్రమించారు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వేకు వచ్చినప్పటికీ, నాటి వైసీపీ ఎమ్మెల్యే ఒత్తిడితో, కుంపటి నాగేంద్రబాబు దౌర్జన్యంతో సర్వే సిబ్బందిని అడ్డుకుని వెనక్కి పంపారు. ప్రభుత్వ భూమిని 22(ఎ) జాబితాలో చేర్చకుండా ప్రైవేటు వ్యక్తుల రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ సిబ్బంది సహకరించారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన నీలం పిచ్చయ్య అర్జీలో... నా భార్య నీలం తిరుపతి వెంకటకుమారి పేరిట మా గ్రామంలో సర్వే నెం.565/16-15, 565/16-16లో డీకే పట్టా ద్వారా వచ్చిన 2.05 ఎకరాల భూమితో పాటు పూర్వార్జితంగా సంక్రమించిన వివిధ సర్వే నెంబర్లలో (267, 262-ఎ, 263, 565/16-6, 16-8, 16-9, 16-10) మొత్తం 7.15 ఎకరాల భూమి ఉంది. దీనికి సంబంధించి 2008లోనే తహసీల్దారు పట్టా మంజూరు చేశారు. గత 30 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ క్రమం తప్పకుండా శిస్తు కూడా చెల్లిస్తున్నాను. భార్య మరణానంతరం సదరు భూమి నాకు సంక్రమించింది. నా కుమారుడికి కూడా దీనిపై ఎటువంటి అభ్యంతరం లేదు. ఆన్‌లైన్ రీ-సర్వే ప్రక్రియ పూర్తయినా నా పేరు మీద ఆన్‌లైన్ ఎక్కించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని తహసీల్దారును కోరినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తక్షణం చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన లక్ష్మమ్మ విన్నపం ఇది... వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నా భర్త ద్వారా సంక్రమించిన సర్వే నెం.34లో 0.95 సెంట్లు భూమి ఉంది. భర్త మరణానంతరం కూలి పనులు చేస్తూ ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్న నన్ను నమ్మించి ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలానికి చెందిన కర్నాటి బలరామిరెడ్డి ఘోరమైన మోసానికి పాల్పడ్డాడు. ఆలయ గర్భగుడి కట్టిస్తానని, బ్యాంకు లోను ఇప్పిస్తానని నమ్మించి నాకు తెలియకుండా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని అతడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం ఆ భూమిని కలసపాడు మండలానికి చెందిన ఖాజా రంతు అనే వ్యక్తికి అమ్మకానికి పెట్టి రూ.24 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నాడు. ఈ విషయమై అడగ్గా సదరు వ్యక్తి నన్ను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ చంపుతానని బెదిరిస్తున్నాడు. దీనిపై పోరుమామిళ్ల ఎస్ఐకి ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనా లేదు. ప్రతిరోజూ పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారే తప్ప విచారణ చేయట్లేదు. దీనిపై విచారించి సమస్యను పరిష్కరించాలని లక్ష్మమ్మ కోరింది.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన పద్మావతి ఏమందంటే... 2007 సంవత్సరంలో ఎరువుల షాపు బాకీ నిమిత్తం నల్గొండ బాబు, దాసరి బుద్ధి అనే వ్యక్తులు సూరయ్య, నారాయణ మధ్యవర్తిత్వంతో ఒక ఒప్పందం చేయించుకున్నారు. ఆ అగ్రిమెంట్‌ను ఆసరాగా చేసుకుని నాకు చెందిన సర్వే నెంబర్లు 861, 858/41, 286/2, 86 భూమిని అక్రమంగా దక్కించుకోవాలని సదరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. భర్త చనిపోయి ఒంటరిగా ఉన్న నన్ను వారు నిరంతరం ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సుమారు రూ.3.5లక్షలు ఇవ్వాల్సి ఉండగా... దానిని సాకుగా చూపి మొత్తం భూమిని కాజేయాలని చూస్తున్నారు. ఈ విషయమై మాచర్ల పోలీసులను ఆశ్రయించినప్పటికీ వారు సదరు వ్యక్తులను పిలిచి విచారించ ట్లేదు. పైగా వారికే కొమ్ముకాస్తున్నారు. తమరు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని విన్నవించింది.

వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం... ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థనలు అందించారు.

## నగరాభివృద్ధికి సహకరించండి... సీఎంకు కోవెలమూడి వినతి

**● సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు**

గుంటూరు నగర మేయర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నగర అభివృద్ధికి సంబందిచి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గుంటూరు నగరంలోని కాకుమానువారి తోటలోని వెల్ఫేర్ స్థలానికి సంబంధించిన అంశంపై ప్రధానంగా చర్చించి, నగరంలోని సదరు భూమిని ప్రజల సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని మేయర్ ముఖ్యమంత్రికి వివరించారు. గుంటూరు నగర అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలు కూడా ఈ సమావేశంలో ప్రస్తావించామని, సదరు అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. గుంటూరు నగరంలో చేపట్టాల్సిన మౌలిక వసతులు అభివృద్ధి పనులు, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రికి వివరించి, నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ముఖ్యమంత్రిని కోరారు. మేయర్ రవీంద్ర ప్రతిపాదనలపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చిందన్నారు.

## పంటల సాగులో నికర ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి



కురుపాం (చైతన్యరథం): పంటల సాగులో నికర ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని గుంటూరు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం ఉప సంచాలకులు డా.బి. ముకుందరావు అన్నారు. గురువారం కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 42వ శాస్త్రీయ సలహా సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గతేడాది కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ కార్యక్రమాల పురోభివృద్ధిని కేవీకే సమన్వయకర్త డా. ఎస్. ధ్రువ వివరించారు. వచ్చే ఏడాది చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ముందుగా కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించిన పంట క్షేత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ డా.ఎ. అప్పలస్వామి, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త బి. శారద, పశు సంవర్ధక ఏడీ శ్రీసంధ్య, వ్యవసాయ అధికారులు శంకరరావు, విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా.కె. లక్ష్మణ్, తేజేశ్వరరావు, కేవికే శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించాలి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్ష వివరాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

## 12 ఏళ్ల తర్వాత దుర్గ గుడిలో కుంభాభిషేకం


**●మార్చి 6వ తేది నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న క్రతువు... ఏర్పాట్లు పూర్తి**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో కుంభాభిషేకం కార్యక్రమానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. దుర్గగుడిలో 12 సంవత్సరాలకు ఒకసారి కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే మార్చి ఆరో తేదీ నుంచి దుర్గగుడిలో కుంభాభిషేకం కార్యక్రమం ప్రారంభం కానుంది. మొత్తం మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. మార్చి 6, 7, 8 తేదీల్లో కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయ విమాన గోపురాలకు సంప్రోక్షణ నిర్వహిస్తారు. వేద మంత్రాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు 2012 సంవత్సరంలో విజయవాడ దుర్గగుడిలో కుంభాభిషేకం జరిగింది. అయితే ప్రధాన రాజగోపురం ప్రతిష్ట సందర్భంగా రెండేళ్లలోపే.. అంటే 2014లో మళ్లీ కుంభాభిషేకం నిర్వహించారు. 12 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో ఇప్పుడు మరోసారి కుంభాభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై ఉన్న విగ్రహాలు, గోపురాలకు పునరుజ్జీవనం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో భాగంగా పవిత్ర నదులు, సముద్రాల నుంచి జలాలను సేకరించి ఆలయంలోని యాగశాలలో మూడురోజుల పాటు పూజలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆ జలంతో గోపురాలు, కలశాలకు అభిషేకం నిర్వహిస్తారు. కుంభాభిషేకం.. ఏ రోజున ఏం చేస్తారంటే.. మార్చి ఆరో తేదీన యాగశాలలో ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ నిర్వహిస్తారు. తర్వాత పుణ్యాహవచనం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన వంటి కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటుగా.. మూలమంత్ర హవనములు, హారతి ఉంటుంది. రాత్రి 7 మంత్ర పుష్పం కార్యక్రమం ఉంటుంది. మార్చి ఎనిమిదో తేదీ ఉదయం 8 గంటలకు అష్టోత్తర కలశస్థాపన, పూజ, పీఠ పూజలు ఉంటాయి. మధ్యాహ్నం 12గంటలకు మూలమంత్ర హవనములు కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం ప్రదోషకాల పీఠపూజలు, హారతితో పాటుగా 7 గంటలకు మంత్ర పుష్పం ఉంటుంది. ఆఖరి రోజైన మార్చి ఎనిమిదో తేదీ ఉదయం మంటప పూజలు, మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి ఉదయం 9.34 నిమిషాలకు అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేకం నిర్వహిస్తారు. మరోవైపు కుంభాభిషేకం కార్యక్రమానికి భక్తులకు అనుమతి లేదని ఆలయ అధికారులు వెల్లడించారు. ఇది అంతర్గత కార్యక్రమమని.. యాగశాలలోకి భక్తులను అనుమతించమని క్లారిటీ ఇచ్చారు. అయితే దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు లేవని వెల్లడించారు.

## కొవ్వూరు అభివృద్ధికి సహకరించండి

**●డిప్యూటీ సీఎం పవన్‌కు కళ్యాణ్‌కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



అమరావతి / కొవ్వూరు (చైతన్యరథం): 2027లో జరగనున్న పుష్కరాల వేళ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలోని పవన్‌కళ్యాణ్ ఛాంబర్‌లో కలిసి పశ్చిమ గోదావరి జిల్లా తీరప్రాంతంలో తాగునీటి సరఫరా ప్రాజెక్టును RWS&S శాఖ ద్వారా రూ.1400.00 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మీషన్ (గ్రాంట్ కింద మంజూరు చేయబడిందని, ఈ వాటర్ గ్రిడ్ దశ-1 ప్రాజెక్టులో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 3 మండలాల్లో 49 నివాసాలను చేర్చాలని కోరారు. రూ.104 కోట్ల 84 లక్షలు అంచనాలతో వ్యయంతో గోదావరి పుష్కరాలు 2027 కొవ్వూరు మరియు దాని పరిసర ప్రాంతాలకు భక్తులు మరియు యాత్రికులు పెద్ద సంఖ్యలో వస్తారని, పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రధాన తీర్థయాత్ర కేంద్రంగా, పండుగ సజావుగా నిర్వహించడానికి మరియు ప్రజా పరిశుభ్రతను కాపాడుకోవడానికి తగిన మౌలిక సదుపాయాలు చాలా అవసరమని, ఘాట్లు మరియు ప్రక్కనే ఉన్న కాలనీల దగ్గర ప్రభావవంతమైన తుఫాను నీరు మరియు వ్యర్థ జల నిర్వహణ కోసం CC డ్రెయిన్ల నిర్మాణం, యాత్రికులు మరియు స్థానిక నివాసితులకు సురక్షితమైన మరియు తగినంత తాగునీటి సరఫరా ఏర్పాట్లు, గుర్తించబడిన ఘాట్లు మరియు యాత్రికుల సమావేశ ప్రదేశాలలో తగినంత టాయిలెట్ కాంప్లెక్సులు, స్నానపు సౌకర్యాలు మరియు పారిశుధ్య యూనిట్ల నిర్మాణం, పుష్కరాల సమయంలో పెరిగిన డిమాండ్‌ను తీర్చడానికి నియోజకవర్గంలో ఉన్న సింగిల్ విలేజ్ స్కీమ్‌ల (SVS) విస్తరణ మరియు బలోపేతం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

## రాజకీయ అవగాహన లేని వ్యక్తి దేవినేని అవినాష్

**● టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్**



విజయవాడ (చైతన్యరథం): ఏ మాత్రం రాజకీయ అవగాహన లేని వ్యక్తి వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అని టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ అన్నారు. అటువంటి వ్యక్తి ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడుగా ఉన్నాడంటే వైసిపి దీన పరిస్థితి ఏంటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. గురునానక్ కాలనీలో ఎన్టీఆర్ భవన్ విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొట్లూరి దర్శిత్ మాట్లాడుతూ... వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తన స్థాయికి మించి మాట్లాడుతున్నాడన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మీద, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌పై వ్యాఖ్యలు చేయడంను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరువూరు నియోజకవర్గం నెమలిలో జరిగిన సంఘటనపై ఎంపీని విమర్శిస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు వ్యవహార శైలిని ఆసరాగా తీసుకుని ఆ ఘటనను రచ్చ చేసి రాజకీయ లబ్ది పొందేందుకు వైసిపి చూస్తోందన్నారు. దేవినేని అవినాష్ తండ్రి కూడా గతంలో కంకిపాడు శాసన సభ్యుడుగా పని చేసినప్పుడు ఆనాడు ఎంపీలుగా పనిచేసిన పర్వతనేని ఉపేంద్ర, లగడపాటి రాజగోపాల్‌తో ఏ మాత్రం సఖ్యతగా ఉండేవాడో బెజవాడ ప్రజలందరికీ తెలుసు అన్నారు. పాత కాంగ్రెస్ నాయకులను ఎవరినడిగినా ఆ విషయాలు చెబుతారన్నారు. అవినాష్ తండ్రి కూడా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నాటి ఎంపీలతో సఖ్యతగా ఉన్న పరిస్థితి లేదన్నారు. ఏ రాజకీయ పార్టీలో అయినా అంతర్గత విషయాలు ఉంటాయని, ఇవేమీ తెలియని దేవినేని అవినాష్‌కు రాజకీయాల పట్ల అవగాహన లేదని మరోసారి స్పష్టం అవుతోందన్నారు. అవినాష్ వంటి రాజకీయ పరిపక్వత లేని వారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుడిగా చేశారంటే ఆ పార్టీ ఎలాంటి దీన స్థితిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చన్నారు. సహజంగా రాజకీయ పార్టీలు ప్రధాన పార్టీలన్నీ కూడా సీనియర్ ప్రజా ప్రతినిధులని జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించడం జరుగుతుందని, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న దేవినేని అవినాష్ కార్పొరేటర్‌గా గెలిచిన పరిస్థితి లేదన్నారు. కార్పొరేటర్ స్థాయిలో కూడా గెలిచిన దాఖలాలు లేవన్నారు. అటువంటి వ్యక్తిని జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పెట్టారంటే వైసిపి పార్టీ ఎలాంటి అధ్వాన స్థితిలో ఉందో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో ఇతను ఎంపీ గా పోటీ చేస్తే కనీసం డిపాజిట్ కూడా రానిటువంటి పరిస్థితి చూశామన్నారు. ఆ తర్వాత 2019 లో ఇతను గుడివాడ వెళ్లి ప్రగల్భాలు పలికినటువంటి పరిస్థితి కూడా చూశామంటూ...గుడివాడ వెళ్లి కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటాం నా సెల్ ఫోన్ నెంబర్ రాసుకోండి అని చెప్పి మాట్లాడినటువంటి అవినాష్ అక్కడ ఘోర పరాభవం తర్వాత మరి 24 గంటల్లోనే తోక ముడుచుకుని బెజవాడ పారిపోయి వచ్చిన మాట వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు.

# వ్యాధిగ్రస్తులకు సీఎంఆర్ఎఫ్ భరోసా

**● లివర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వేమూరు నియోజకవర్గ వ్యక్తికి రూ.6 లక్షల ఎల్వోసీ మంజూరు**



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భట్టిప్రోలు మండలం, భట్టిప్రోలు గ్రామానికి చెందిన బండారు దేవి వరప్రసాద్ లివర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చుల నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) మంజూరు చేయాలని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు లేఖతో ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయానికి బిల్లులను పంపించారు. ఈ విషయంపై స్పందించిన ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయం, బాధితుని వైద్య చికిత్స నిమిత్తం రూ. 6,00,000/- విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను మంజూరు చేసింది. మంజూరైన ఎల్వోసిను బాధితుడు బండారు దేవి వరప్రసాద్ కుటుంబ సభ్యులకు, గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనందబాబు అందజేశారు. ఈ సందర్భంగా బండారు దేవి వరప్రసాద్ కుటుంబసభ్యులు, తమకు ఆర్థిక సహాయం అందించిన వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకి, అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం మంజూరు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే నసీర్ మాట.. అభివృద్ధికి బాట

**◆ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకరించండి**

**◆నూతన అంగన్ వాడీ కేంద్రాలు మంజూరు చేయండి**

**◆అసెంబ్లీ క్వశ్చన్ అవర్‌లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం నిర్వహించిన క్వశ్చన్ అవర్‌లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆరోగ్యాంధ్రప్రదేశ్, అంగన్ వాడీల బలోపేతం, మునిసిపాలిటీల్లో సదుపాయాల కల్పన వంటి అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల బలోపేతానికి ఇండక్షన్ స్టవ్, ప్లే కిడ్స్, రేషన్ హోం డెలివరీ వంటి సౌకర్యాల కల్పన, మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాలకు చేపట్టిన కార్యక్రమాలపై సంబంధింత శాఖ మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూనే మరింత ప్రజా అవసరాలను సభ ముందుంచారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో, విధ్వంసకర ఆలోచనలతో అంగన్ వాడీ కేంద్రాలను నాశనమైన తీరును సభ కళ్లకు కట్టినట్టు వివరిస్తూనే.. సీఎం నారా చంద్రబాబునాయుడు సంకల్పంతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి అంగన్‌వాడీల కేంద్రాల్లో మరింత పౌష్టికాహారం అవసరమని తెలియజేశారు. అర్బనైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో నూతన అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటు విషయాన్ని సభాపతి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే నసీర్.. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, వెంటనే మంజూరుకు అనుమతులివ్వాలని విన్నవించారు. గుంటూరు మునిసిపాలిటీలో పీడీ అకౌంట్ నిధులు రూ.360 కోట్లు నిలిచిపోయాయని, వీటిని నగరపాలక సంస్థ మెయింటెనెన్స్ కు వినియోగించేలా అవకాశం కల్పించాలని మంత్రి నారాయణను కోరారు. మునిసిపాలిటీలో ఉద్యోగుల కొరతను అధిగమించాలని, సచివాలయ భవనాల నిర్మాణం ద్వారా వృథా అద్దెల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇదే సయమంలో మెప్మా భవన నిర్మాణం ఆవశ్యతను సభ దృష్టికి తీసుకొచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఆటోనగర్ లో ప్రతి రోజూ 20 వేల మంది పని చేస్తుంటారని, వెంటనే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కుక్కల బెడద నివారణకు మొబైల్ ఏబీసీ వ్యాక్సినేషన్ అవసరమని తెలిపారు. దళితవాడల అభివృద్ధికి రూ.20 కోట్లు బ్రిడ్జి కోర్సుల కోసం రూ.2 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హర్షం

**◆ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే సాహసోపేతమైన పాలసీలు అవసరం**



గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో బడ్జెట్ పరంగా కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే ఇలాంటి సాహసోపేతమైన పాలసీలు అవసరమని, ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అందరూ మద్దతించాలని కోరారు. తలసరి ఆదాయంలో ప్రపంచంలోనే 15వ స్థానంలో ఉన్న స్వీడన్ వంటి ధనిక దేశం కూడా జనాభా పెరుగుదల కోసం ప్రోత్సాహకాలు ఇస్తోందని, అదే క్రమంలో మన రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 25,000 ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. అమెరికా వంటి అగ్రరాజ్యంలో కూడా ఐవీఎఫ్ వంటి చికిత్సలకు ఉచిత సౌకర్యం లేదని, ఇన్సూరెన్స్ ఉంటేనే వైద్యం అందే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఈ సదుపాయాన్ని తీసుకురావాలనే ఆలోచన అమెరికాకు కూడా రాలేదని ఆయన ప్రశంసించారు. విదేశాల్లో ఉన్న సుమారు 10 లక్షల మంది ఎన్ఆర్ఐలు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా, ఇక్కడ పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం ప్రోత్సాహకరమైన పాలసీలు తీసుకువస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత ఆశాజనకంగా లేకపోయినా, భవిష్యత్ తరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రసంగంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, రాష్ట్రం ప్రస్తుతం ఆర్థికంగా 'వెంటిలేటర్' మీద ఉన్న స్థితి నుండి బయటకు వస్తోందని, కేవలం దూరదృష్టితోనే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలకు ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా

**●ఎంపీకేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి కృతజ్ఞతలు తెలిపిన ఎస్.హెచ్.జి మహిళలు**



విజయవాడ (చైతన్యరథం): ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.లో 12వ నైపుణ్యాభివృద్ధి ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లాకు ఎస్.హెచ్.జికి చెందిన 45 మంది మహిళలు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం ఎన్.ఐ.ఆర్.డిలో జరిగింది. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఎన్.ఐ.ఆర్.డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, ప్రొఫెసర్స్ డాక్టర్ కతిరేషన్, మష్రూమ్ ట్రైనర్ ఎస్.పిరెడ్డి, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీ ట్రైనర్ మానస సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం మహిళలకు మాట్లాడుతూ... తమ జీవనోపాధి పెంచేందుకు ఇలాంటి అవకాశం ఇంతవరకు ఎవరు కల్పించలేదంటూ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్.ఐ.ఆర్.డికి కృతజ్ఞతలు తెలిపారు. తమకి రూపాయి ఖర్చు లేకుండా శిక్షణ ఇప్పించిన కేశినేని ఫౌండేషన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లను జీవితాంతం గుర్తు పెట్టుకుంటామన్నారు. ఈ ఐదు రోజుల్లో ఈ మహిళలకు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీపై శిక్షణ అందించారు. ఐదవ రోజు వీరందరికీ సంబంధించి మష్రూమ్ ట్రైనర్ ఎస్.పి రెడ్డి, హోమ్ బెస్ట్ ప్రొడక్ట్స్ తయారీ ట్రైనర్ మానస మానస నేతృత్వంలో బిజినెస్ మోడల్ గురించి, అమ్మకాలు, ఆర్డర్లు, ప్యాకేజింగ్, మార్కెటింగ్, లేబులింగ్ విధానాలు, కాస్ట్ ఎనాలిసిస్‌లపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే మహిళా పారిశ్రామికవేత్తల కోసం వున్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలతోపాటు వ్యాపార నైపుణ్యాల మెరుగుదల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అర్బన్ ఎన్.ఐ.ఆర్.డి కో- ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగరంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం గుంటూరు కలెక్టరేట్లోని వీసీ హాలులో రైల్వే ప్రాజెక్టపై సమీక్షించారు. గుంటూరు నగరంలో ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా మందివెలుగు వంతెన పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మిగిలిన రైల్వే వంతెన నిర్మాణ పనుల ప్రారంభానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ మయూర్ అశోక్, మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై సీఎం దూరదృష్టి అభినందనీయం

**◆అసెంబ్లీలో పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ప్రసంగించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగం అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అసెంబ్లీలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించిన అంశాలు సమాజానికి ఎంతో అవసరమని, జనాభా నిర్వహణ ఎంత ముఖ్యమో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సవివరంగా వివరించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక మహిళగా ఒకటి కంటే ఎక్కువ పిల్లలను కనడం అనేది అనేక సామాజిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితిని తీసుకువస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలతో పాటు సమాజంలో ఉన్న అసమానతలు కూడా కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండటానికి అడ్డంకిగా మారుతున్నాయని, ముఖ్యంగా ఇంటి బాధ్యతలు ఎక్కువగా మహిళల పైనే పడటం, పిల్లలను చూసుకోవడం, అదే సమయంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించాల్సిన పరిస్థితులు మహిళలకు కష్టంగా మారుతున్నాయని గళ్ళా మాధవి వివరించారు. అలాగే కుటుంబ సభ్యుల నుంచి సరైన సహకారం లేకపోవడం వల్ల చాలా మంది దంపతులు ఒక పిల్లవాడే సరిపోతుందనే ఆలోచన వైపు వెళ్లుతున్నారని, ఆధునిక జీవన విధానంలో ఉన్న ఒత్తిడులు కూడా దంపతులు పిల్లలను కనడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిని తీసుకువస్తున్నాయని, అందువల్ల చాలామంది ఐ.వి.ఎఫ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక ఆలోచన ధోరణికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మహిళలను జనాభా పెంపు దిశగా ప్రోత్సహించే అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభిప్రాయపడ్డారు. సమాజంలో సామాజిక సమానత్వం, మహిళలకు సహకారం పెరిగితే కుటుంబాలు ధైర్యంగా ముందుకు వెళ్లి పిల్లలను కనడానికి సిద్ధపడతాయని, అప్పుడు జనాభా నిర్వహణ కూడా సమతుల్యంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# కోవూరు పంచాయతిని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయండి

- పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం గ్రామాలను కోవూరు మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదన
- బుచ్చిరెడ్డి పాళెం మున్సిపాలిటీలో శాఖల వారీగా నిధులు కేటాయించండి
- కోవూరు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మంత్రి నారాయణ హామీ
- శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



అమరావతి/కోవూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేసిన విజ్ఞప్తులకు ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించింది. రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కోసం కూటమి ప్రభుత్వం 14 వేల 539 కోట్లు కేటాయించి పట్టణాభివృద్ధికి బాటలు వేసిందని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో కూడా ఏపీ మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాళెం పురపాలక సంఘంలో నిధుల కొరతను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రేడ్-2 స్థాయికి తగ్గట్టుగా సిబ్బంది నియామకం, డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలని ముఖ్యంగా గుడిపల్లి, రేబాల కాలువల వద్ద సైడ్ రివిట్‌మెంట్‌తో పాటు ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన నిధులు కేటాయిస్తామని సభలో హామీ ఇచ్చారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కోవూరు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. 40 వేల పైగా జనాభా ఉన్న కోవూరుతో పాటు, భౌగోళికంగా కలిసిపోయిన పడుగుపాడు మరియు పోతిరెడ్డిపాలెం పంచాయతీలను విలీనం చేస్తే దాదాపు 75 వేల జనాభా అవుతుందని తద్వారా ఆ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. దీనిపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందిస్తూ స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.

# చీరాల అభివృద్ధిపై ఫోకస్ చేయండి

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కోరిన చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య
- అభివృద్ధి సహకరిస్తానని హామీ ఇచ్చిన ఉపముఖ్యమంత్రి



అమరావతి / చీరాల (చైతన్యరథం): చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య గురువారం ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను అయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా చీరాల నియోజకవర్గం ఎదుర్కొంటున్న శాఖాపరమైన ప్రధాన సమస్యలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక ఎమ్మెల్యే కొండయ్య వెల్లడించారు. మరమ్మతులకు నోచుకోని రహదారులతో పాటు, కీలకమైన తాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని అయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ... నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలంలోని గ్రామాల్లో రోడ్ల మరమ్మతులకు, కొత్త రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని కోరినట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలోని చాలా రోడ్లు అభివృద్ధికి నోచుకోక, నిర్లక్ష్యానికి గురియ్యాయన్నారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడంతో అనేక గ్రామాలలో రోడ్లు చాలా అధ్వాన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. ఇటీవల్ల తుపాన్ ప్రభావంతో నియోజవర్గంలోని సముద్రతీర ప్రాంతాలలోని ప్రధాన కల్వర్టులు రోడ్లు, గ్రామీణ ప్రాంతాల రోడ్లు దెబతిన్న విషయాన్ని ఎమ్మెల్యే కొండయ్య ఉప ముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసుకెళ్లారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన నీటి ప్రాజెక్టులు, గ్రామీణ ప్రాంతాలలో చేపట్టాల్సిన నీటి ప్రాజెక్ట్ గూర్చి క్షుణంగా విచారించినట్లు తెలిపారు. తాను ఇచ్చిన ప్రతిపాదనలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందించారని, నిధుల మంజూరుకు భరోసా ఇచ్చారన్నారు. ఈక్రమంలోనే పర్యాటకరంగంగా అభివృద్ధి చెందుతున్న చీరాల ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించాలని, ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు.

# వార్ ఎఫెక్ట్... పడిపోయిన గుడ్డు ధర



మొన్నటిదాకా కొండెక్కి కూర్చున్న కోడిగుడ్డు ఇప్పుడు దిగొచ్చింది...! పౌల్ట్రీ పరిశ్రమలను పల్టీ కొట్టిస్తోంది...! ఒక్కసారి హాఫ్ రేట్‌కి పడిపోవడంతో పౌల్ట్రీ ఫామ్ యజమానులు లబోదిబోమంటున్నారు. ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా దేశాలు గతవారం రోజులుగా పరస్పరం దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఫలితంగా పశ్చిమాసియా రగులుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబసభ్యులు, కీలక నాయకులు చనిపోయారు. దీంతో ఇరాన్ ప్రతీకారం కట్టలు తెంచుకుంది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులతో విరుచుకుపడుతోంది. కారణంగా ఎక్కడికక్కడ విమానాలు నిలిచిపోయాయి. ఎగుమతులు దిగుమతుల వ్యవస్థ దెబ్బతింది. దాని ప్రభావమే పౌల్ట్రీ రంగంపై తీవ్రంగా పడింది.

దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ కోడిగుడ్డు ఎగుమతులు నిలిచిపోయాయి. తద్వారా పౌల్ట్రీ పరిశ్రమకు రోజుకు 5 కోట్ల నష్టం వాటిల్లుతోంది. దీనికి పోర్టులు, ఎయిర్‌పోర్టుల మూసివేతే ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ ధర నాలుగు రూపాయల యాభై పైసలుగా.. ఉండగా.. స్థానిక మార్కెట్లలో రూ.3.30కి పడిపోయింది. తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల మార్కెట్‌పైనా ప్రభావం పడింది.

భారతదేశం నుండి గల్ఫ్ కంట్రీస్‌కి ప్రతిరోజూ సుమారు 10 మిలియన్ గుడ్లు ఎగుమతి అవుతాయి. ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, బహ్రెయిన్ వంటి మధ్యప్రాచ్య దేశాల్లో భారతీయ గుడ్లకు అతిపెద్ద మార్కెట్లు ఉంది. గత సంవత్సరం భారతదేశం టేబుల్ ఎగ్ ఎగుమతుల ద్వారా రికార్డు సుమారు 91 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. అయితే గత ఫిబ్రవరిలో సౌదీ అరేబియా ప్రజారోగ్య కారణాల దృష్ట్యా భారత్‌తో సహా 40 దేశాల నుండి కోళ్లు, గుడ్ల దిగుమతిపై పూర్తి నిషేధం కూడా ఓ కారణంగా చెప్పుకోవచ్చు. అయితే దేశం మొత్తం ఎగుమతుల్లో తమిళనాడు నమక్కల్ ఎగ్ మార్కెట్ నుంచి 95 శాతం ఉండటంతో అక్కడ తీవ్ర ప్రభావం చూపుతోంది.

# పాపులేషన్ మేనేజ్మెంట్ దేశానికే రోల్ మోడల్‌గా సీఎం చంద్రబాబు

- అసెంబ్లీలో కీలక అంశాలపై స్పందించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
- జనాభా నిర్వహణలో చంద్రబాబు నిర్ణయాలు దేశానికి ఆదర్శం
- గిరిజన కుటుంబాల్లో అధిక సంతానం వల్ల పెరుగుతున్న పేదరికం
- "తల్లికి వందనం" పథకంతో గిరిజన పిల్లలకు విద్యావకాశాలు



అమరావతి/సర్వేపల్లి (చైతన్యరథం): అసెంబ్లీ వేదికగా కీలక అంశాలపై స్పందించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకునే నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకుంటే ఇతర రాష్ట్రాలు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తాయని పేర్కొన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ప్రతిపాదన కూడా అలాంటి కీలక నిర్ణయాల్లో ఒకటని ఆయన స్పష్టం చేశారు. దళిత సమాజం కుటుంబ నియంత్రణను పాటిస్తూ చిన్న కుటుంబాలుగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. అయితే గిరిజన కుటుంబాల్లో ఎక్కువ మంది పిల్లలు ఉండటం వల్ల పేదరికం, నిరక్షరాస్యత సమస్యలు మరింత పెరుగుతున్నాయని అన్నారు. వైసీపీ పాలనలో గిరిజన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక బిడ్డను మాత్రమే పాఠశాలకు పంపేవారని సోమిరెడ్డి పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం వల్ల ఇప్పుడు రెండు, మూడు మంది పిల్లలను కూడా పాఠశాలకు పంపించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తన సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది గిరిజనులు ఉన్నారని, ఏ గ్రామానికి వెళ్లినా వారి సమస్యలపై ఆరా తీస్తుంటానని చెప్పారు. ముఖ్యంగా చల్లా యానాది గిరిజనుల్లో పేదరికం ఎక్కువగా ఉందని, ఒక్కో కుటుంబంలో ఐదుగురికి పైగా పిల్లలు ఉండటం సాధారణమైందని వివరించారు. ఆ పిల్లలను నిరక్షరాస్యత, పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

# అల్లా ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): అల్లా ఆశీస్సులతో నెల్లూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇంతియాజ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ నెల అంటే ఖురాన్ అవతరించిన నెల అని, రోజంతా ఉపవాస దీక్షతో ఉండి, సాయంత్రం వేళ భక్తితో ప్రార్థనలు చేసి ఉపవాసాన్ని విరమిస్తారన్నారు. ఇఫ్తార్ విందు అంటే కేవలం భోజనం మాత్రమే కాదు.. అల్లా ఆశీసులు అందుకునే అవకాశమని చెప్పారు. పేదలకు దాన ధర్మాలు, తోటివారికి భోజనం అందించడం రంజాన్‌లో పవిత్రమైన కార్యాలని, ఆపదలో ఆదుకున్నవారిని.. అల్లా చల్లగా చూస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# వేట్లపాలెం విస్ఫోటనం 28కి చేరిన మృతుల సంఖ్య

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం ఘటనలో మృతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో పెద్దాపురం కొండయ్యపేటకు చెందిన మోర్తా శ్రీను (30), చౌడేశ్వరీ నగర్‌కు చెందిన వెంకటలక్ష్మీ (69) ఉన్నారు. వీరితో బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 28కు చేరింది. ఫిబ్రవరి 28 శనివారం రోజు మధ్యాహ్నం 2 గంటలకు భారీ పేలుడు సంభవించింది. ఈ విస్ఫోటనంలో అదేరోజు 20 మంది ఆహుతయ్యారు. ఆ తర్వాత చికిత్స పొందుతున్న వారిలో ఒక్కొక్కరు ప్రాణాలొదులుతూ నేటికి మృతుల సంఖ్య 28కి చేరింది. కాగా మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్యే పల్లె

**●విజయవాడ కనకదుర్గమ్మకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పూజలు**



పుట్టపర్తి (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, నారా చంద్రబాబునాయుడు మరో 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరుకున్నట్లు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, నియోజవర్గ కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలసి దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్లు ప్రజలకు సుపరిపాలన అందించాలని దుర్గమ్మను కోరుకున్నట్లు తెలిపారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధినీ రాష్ట్రానికి రెండు కళ్లులా అమలు చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అంతా మంచి జరగాలని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు కనకదుర్గమ్మను కోరుకున్నారు.

## తిరుమలలో మాక్‌డ్రిల్.. పాల్గొన్న టీటీడీ విజిలెన్స్



తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు, పద్మావతి అతిథి గృహంలో గురువారం వేకువజామున నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌ఏ) బలగాలు మాల్ నిర్వహించాయి. తొలుత రాంభగీచ అతిథి గృహం ఎదురుగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. జిల్లా యంత్రాంగంతోపాటు టీటీడీ విజిలెన్స్, ఫైర్, ఆలయ సిబ్బంది ఈ మాల్లో పాల్గొన్నారు. 160 మంది ఎన్ఎస్ గార్డులు, 30 మంది అధికారులు మాల్లో పాల్గొన్నారు.


## జిల్లా అభివృద్ధిపై సీఎంకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి వినతి



అమరావతి (చైతన్యరథం): కడప నియోజకవర్గం మరియు జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై గురువారంర అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని ప్రధాన సమస్యలను వివరించి, అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని రోడ్ల విస్తరణ మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరుపై ముఖ్యమంత్రితో చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, కడప జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, మాధవి పేర్కొన్నారు.

## ఒంటిమిట్ట రామయ్య రథానికి మరమ్మతులు

ఒంటిమిట్ట (చైతన్యరథం): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2వ తేదీన రథోత్సవం జరగనుంది. గురువారం రామయ్య రథానికి మరమ్మతులు చేయాలని రైతు మండపం నుంచి బయటికి తీశారు. చక్రాలను బాగు చేయనున్నారు. కొత్తగా రంగులు వేయనున్నారు. ఈ పనులు చేపట్టడానికి తితిదే అధికారులు రూ.9.50 లక్షల నిధులు కేటాయించారు.



# టమాట రైతు పరిస్థితి దయనీయం...

## పంటను పొలంలోనే వదిలేస్తున్న రైతన్నలు

**● పంటను కొనేవారే కరువయ్యారని రైతుల ఆవేదన... ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు**



టమాటా రైతు పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టాలను చవి చూస్తున్నారు. కిలో రూ.2కు అమ్ముతున్నా కొనేవారు లేరు. గత నెలలో రూ.40 ధర పలికినా అప్పటికి పంట చేతికి రాలేదు. వచ్చే సమయానికి ధర లేదు. మార్కెట్‌లో టమాటా విక్రయానికి రైతులు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మార్కెట్లో రోజంతా నిరీక్షించినా అమ్ముకోలేని పరిస్థితి. ఆరుగాలం పండించిన టమాటాకు ధర లేక, ప్రభుత్వం కొనుగోలు చేయక రైతులు లబోదిబోమంటున్నారు. ట్రే టమాటా ధర రూ.100 కూడా పలకకపోవడంతో దిగాలు చెందుతున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కొనేవారు లేకపోవడం, మార్కెటింగ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తిందని దివిసీమ రైతులు తల్లడిల్లుతున్నారు.

**పంటను కొనేవారే కరువయ్యారు** : టమోటాకు కనీస మద్దతు ధర లేక కృష్ణా జిల్లా మోపిదేవి మండలం రైతులు విలవిలల్లాడుతున్నారు. అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో సుమారు 900 ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేశారు. గత డిసెంబర్‌లో కిలో టమాటా రూ.40 పలకడంతో ఈసారి కూడా మంచి ధర వస్తుందనే ఆశాభావంతో రైతులు పెద్ద ఎత్తున టమాటా సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉన్నా, దిగుబడి సమయానికి కొనేవారు కరవయ్యారని వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.40 వేలు ఖర్చు చేస్తే, కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. టమాటా కేజికి ఒక్క రూపాయి కూడా రైతులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటను కనీసం కొనేవారే కరువయ్యారని వాపోతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక పంట పైనే కాకుండా వినూత్న రీతిలో పంట మార్పిడి చేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి తగ్గినప్పుడు ఎన్నడూ లేని విధంగా ధరలు పలుకుతాయని, ఊహించినంత దిగుబడి వస్తే అసలు మద్దతు ధరనే ఉండట్లేదని రైతులు కలత చెందుతున్నారు. కనీసం పంట పెట్టుబడి మాత్రం కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని టమాటా రైతులు లబోదిబోమంటున్నారు. ఇంకా చేనులో ఉన్న సుమారు టన్నుకు పైగా టమాటను తెంచి, విక్రయించాలనే ఆశ కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. పంటను విక్రయిస్తే కనీసం రోజు కూలీ డబ్బులు రావడం లేదని అంటున్నారు.

ప్రస్తుతం కిలో టమాటాను రైతుల నుంచి కేవలం 2 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలతో కనీసం కూలీ ఖర్చులు కూడా రావని రైతులు బోరుమంటున్నారు. గత్యంతరం లేక కొందరు రైతులు పొలాల్లోనే టమాటాలను వదిలేసి వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటాకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# నిరుద్యోగులకు సువర్ణావకాశం...

# మార్చి 7న గుంటుపల్లిలో భారీ ఉద్యోగ మేళా




ఇబ్రహీంపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఒక అద్భుతమైన అవకాశం రాబోతోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో భారీ ఉద్యోగ మేళా నిర్వహణకు సర్వం సిద్ధమైంది. 'ఎన్టీఆర్ వికాసం' ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ, శనివారం నాడు ఈ కార్యక్రమం జరగనుంది. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉద్యోగ మేళా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ వద్ద ఉన్న రైతు సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధృవీకరణ పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ మేళాలో సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఆయా కంపెనీల్లో ఖాళీగా ఉన్న వివిధ హోదాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

## టీడీపీ కేంద్ర కార్యలయంలో నెల్లూరు పార్లమెంట్ నాయకుల కీలక భేటీ

**●అనుబంధ సంఘాల కమిటీల నియామకాలపై విస్తృత చర్చ**

**●మహిళలు, యువతకు ప్రాధాన్యతతో కమిటీలు ఏర్పాటు**

**●జిల్లాలో పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయం**



మంగళగిరి, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నెల్లూరు పార్లమెంట్ పరిధికి చెందిన నాయకులు కీలక భేటీ అయ్యారు. అనుబంధ సంఘాల కమిటీల నియామకం, వాటి విధివిధానాలపై జిల్లా నాయకులు విస్తృతంగా చర్చించారు. ప్రతి నియోజకవర్గానికి సమాన ప్రాధాన్యత కల్పించే విధంగా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం, యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేలా నియామకాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. త్వరలోనే అనుబంధ సంఘాల కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని నాయకులు స్పష్టం చేశారు. జిల్లాలో అనుబంధ సంఘాలను బలోపేతం చేయడానికి సమన్వయంతో పని చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ భేటీలో జోనల్ ఇన్‌చార్జి, శాసనమండలి సభ్యుడు రామ్ భూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.



# చంద్రబాబు బ్రాండ్‌ని ప్రపంచానికి చాటుతాం

- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములవుతాం
- స్పెషల్ రిప్రజెంటేటివ్‌గా కోమటి జయరాం బాధ్యతల స్వీకారం
- హాజరైన ఎన్ఆర్ఐ, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టీ చైర్మన్ రవి






అమరావతి (చైతన్యరథం): 'సుదీర్ఘ పాలనా అనుభవం కలిగిన చంద్రబాబు బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పి రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు కృషి చేస్తాం... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములం అవుతాం' అని నార్త్ అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం పేర్కొన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టీ చైర్మన్ వేమూరి రవికుమార్, వివిధ దేశాలకు చెందిన ఎన్ఆర్ఐ ప్రముఖుల సమక్షంలో వేదపండితుల ఆశీర్వచనాల నడుమ తాడేపల్లిలోని ఏపీఎన్ఆర్టీ కార్యాలయంలో జయరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ప్రవాసాంధ్ర ప్రముఖులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించేందుకు జయరాం కృషి చేయాలని కోరారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు ఆయన సేవలు ఉపయోగపడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ రవి మందలపు, ఏపీఎన్ఆర్టీ డైరెక్టర్లు అక్కిలి నాగేంద్రబాబు (ఆపరేషన్ & సర్వీసెస్), నరిశెట్టి శాంతి (కల్చరల్, హెరిటేజ్), నాట్స్ కన్వీనర్ గుత్తికొండ శ్రీనివాస్, ప్రముఖ ఎన్ఆర్ఐ వైద్యులు డాక్టర్ రాజా పిల్లి, డాక్టర్ శ్యామ్, లాస్ ఏంజెల్స్ ఎన్ఆర్ఐ టీడీపీ ప్రెసిడెంట్ ఆళ్ల వెంకట్, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీధర్ పాటిబండ్ల, తానా సభ్యుడు కోగంటి వెంకట్, ఎన్ఆర్ఐ ప్రముఖులు కాజా చంద్ర, గొట్టిపాటి చందు, అనిల్ వీరపునేని, జితేంద్ర అట్లూరి, ఈదర మోహన్, కోనేరు వాసు, దొడ్డపునేని శ్రీకాంత్, పెనపనేని ప్రశాంత్, వెంకట జెట్టి, ఏపీఎన్ఆర్టీ సీఈవో కృష్ణమోహన్, ఎన్ఆర్ఐ టీడీపీ కో-ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ నేత రాచూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా పనిచేస్తా

కోమటి జయరాం మాట్లాడుతూ... ఈ నెలాఖరుకు అమెరికాలో ప్రవాసాంధ్ర ప్రముఖులతో ఒక సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. దేశంలో మరే రాష్ట్రానికి లేని చంద్రబాబు బ్రాండ్ ఏపీకి సొంతమన్నారు. ఆ బ్రాండ్ వల్లే ఈరోజు హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో నిలిచిందని, అదే బ్రాండ్‌తో అమరావతి విశ్వనగరంగా ఆవిష్కృతం కాబోతోందని తెలిపారు. గతంలో ఎన్ఆర్ఐ టీడీపీ కో-ఆర్డినేటర్‌గా కేవలం సేవా కార్యక్రమాలు మాత్రమే చేపట్టానని, ఇప్పుడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బిజినెస్ మోడల్‌ను ప్రమోట్ చేసి పరిశ్రమల సాధనకు కృషి చేస్తానన్నారు. అమెరికాలోని అన్ని తెలుగు సంఘాలను సమన్వయం చేసుకుని ప్రభుత్వానికి, ప్రవాసాంధ్రులకు వారధిగా పనిచేసి రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా పని చేస్తానని చెప్పారు. ప్రవాసాంధ్రులకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్టీ చైర్మన్ వేమూరి రవికుమార్‌లకు జయరాం కృతజ్ఞతలు తెలిపారు.









## 'టాటా' ఆధ్వర్యంలో ఉగాది, శ్రీరామనవమి వేడుకలు

నార్త్ కరోలినా: నార్త్ కరోలినాలోని ట్రయాంగిల్ ఏరియా తెలుగు అసోసియేషన్ (టాటా) 35 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా ఉగాది, శ్రీరామనవమిలను ఘనంగా నిర్వహించనుంది. మార్చి 22వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మోరిస్‌విల్లేలోని హెచ్ఎస్ఎన్‌సీ ప్రాంగణంలో వేడుకలు జరుగుతాయి. సుమారు 2,500 మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉన్నందున తమ వ్యాపారాలను ప్రదర్శించాలనుకునే వారి కోసం వెండర్ స్టాల్ రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. ఆసక్తి గల వారు నిర్ణీత లింక్ ద్వారా స్టాల్స్‌ను రిజర్వ్ చేసుకోవచ్చని 'టాటా' కోశాధికారి, మహిళా బోర్డ్ డైరెక్టర్ హేమ దాసరి తెలిపారు. వినోద్‌కుమార్ కట్రగంట అధ్యక్షతన సాగే వేడుక విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు వ్యాపార ప్రకటనలకు ఒక మంచి వేదికగా నిలవనుంది.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం తానా - 'సాట్' ట్యూటరింగ్

ఉత్తర అమెరికా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా, టెస్ట్ ప్రెప్ పండిట్స్ సంస్థతో కలిసి అమెరికావ్యాప్తంగా హైస్కూలు విద్యార్థుల కోసం 'సాట్' ట్యూటరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. విద్యార్థులు 'సాట్' పరీక్షకు మెరుగైన సన్నద్ధత సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తానా వెల్లడించింది. సుమారు 2వేల డాలర్లు విలువైన కోచింగ్‌ను కేవలం 75డాలర్ల రిజిస్ట్రేషన్ ఫీజుతో అందిస్తున్నారు. ముఖ్యంగా ఇది తెలుగు సమాజానికి మాత్రమే కాకుండా అమెరికాలోని అన్ని కమ్యూనిటీల విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది.




'సాట్' ట్యూటరింగ్ ప్రోగ్రామ్‌ను ఏప్రిల్ 3 నుంచి 25వ తేదీ వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మొత్తం 16 గంటల శిక్షణతో పాటు రెండు పూర్తిస్థాయి ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తారు.

టెస్ట్ ప్రెప్ పండిట్స్ సంస్థ స్థాపకుడు, హ్యూస్టన్ ఐఎస్‌డీలో ఏపీ కాలిక్యులస్ ఏబీ/బీసీ ఉపాధ్యాయుడు అన్వర్ గణిత శిక్షణ అందిస్తారు.

నేషనల్ బోర్డ్ సర్టిఫైడ్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు, లాస్ వెగాస్‌లో 15 సంవత్సరాలకు పైగా బోధనా అనుభవం వున్న మిస్ రానా కొరన్ ఇంగ్లీష్ రీడింగ్ శిక్షణ అందిస్తారు.

సాట్/ఏసీటీ ఆంగ్ల బోధనలో ఆరు సంవత్సరాలు అనుభవం కలిగిన ఉపాధ్యాయుడు మిస్టర్ నబిల్ ఇంగ్లీష్ రైటింగ్, గ్రామర్ శిక్షణ ఇస్తారు.

కోర్సులో భాగంగా 6 గంటలు గణితం, 5 గంటలు ఇంగ్లీష్ రైటింగ్, 5 గంటల ఇంగ్లీష్ రీడింగ్ తరగతులు ఉంటాయి. అదనంగా ఏప్రిల్ 1న ప్రారంభ ప్రాక్టీస్ టెస్ట్, ఏప్రిల్ 26న ఫైనల్ ఫుల్‌లెంగ్త్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల సిద్ధతను పరీక్షిస్తారు.

ఇప్పటికే తానా, టెస్ట్ ప్రెప్ పండిట్స్ కలిసి నిర్వహించిన 'సాట్' ట్యూటరింగ్ ద్వారా సుమారు రెండు వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా సేకరించిన నిధుల ద్వారా $100,000కు పైగా నిధులు తానా 'రైతు కోసం' కార్యక్రమానికి సమకూర్చి భారతదేశంలోని గ్రామీణ రైతులకు వ్యవసాయ పరికరాలు అందించారు.

## టీఫాస్ ఆధ్వర్యంలో మే 3న ఉగాది వేడుకలు

న్యూజెర్సీ: న్యూజెర్సీలోని తెలుగు కళా సమితి (టీఫాస్ ) ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. వీటిని మే 3వ తేదీ ఆదివారం జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫోర్డ్స్‌లోని రాయల్ ఆల్బర్ట్ ప్యాలెస్ వేదికగా మధ్యాహ్నం నాలుగు నుంచి రాత్రి 11 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగుతాయి. వేడుకలకు సంబంధించిన వివరాల కోసం మధు అన్న, లోకేందర్ గిరకల, అరుంధతి శకెల్లి, ఇతర బోర్డు సభ్యులను సంప్రదించవచ్చు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించే ఉగాది ఉత్సవాలకు ప్రవాస తెలుగు వారందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని టీఎఫ్ఏఎస్ ట్రస్టీల బోర్డు కోరుతోంది.



# యుద్ధం కాదు.. చర్చలతోనే పరిష్కారం

## ప్రధాని మోదీ

సైనిక ఘర్షణల ద్వారా ఏ సమస్యనూ పరిష్కరించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఇటీవల ఈయూతో కుదుర్చుకున్న 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం'.. భారత్, ఫిన్లాండ్ల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తుంద న్నారు. "భారత్, ఫిన్లాండ్లకు చట్టబద్ధ పాలన, చర్చలు, దౌత్య మార్గాలపై విశ్వాసం ఉంది. కేవలం సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం. అది ఉక్రెయిన్, లేదా పశ్చిమాసి యా.. ఏదైనా కావచ్చు. వివాదాలను వీలైనంత త్వరగా ముగించేం దుకు, శాంతిని నెలకొల్పేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తూనే ఉంటాం" అని తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త



పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఫిన్లాండ్ అధ్యక్షుడితో చర్చల్లో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకో వాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. "ఏఐ నుంచి 6జీ వరకు, క్లీన్ ఎనర్జీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు అనేక హైటెక్ రంగాల్లో పరస్పర సహకారానికి కట్టుబడి ఉన్నాం" అని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భారత్కు వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టారు.

## రాజ్యసభకు వెళుతున్నా..

### బిహార్ సీఎం నితీశ్‌కుమార్ సంచలన ప్రకటన



జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. దీంతో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటివరకు తాను మూడు సభల్లో సభ్యుడిగా ఉన్నానని, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించి 'నాలుగు సభల క్లబ్'లో చేరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొ ల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్రస్థాయిలో రెండు చట్టసభ లతో పాటు పార్లమెంట్‌లోని ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుం టున్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేతకే సీఎం పదవీ బాధ్యతలు దక్కవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశ వ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ కు వెళ్లేందుకు నామినేషన్ వేయనున్నారు.

### ఇరాన్‌పై దాడి కోసం

# భారత్ పోర్టులను అమెరికా వాడుతోందా?

**- ఆ వ్యాఖ్యలను ఖండించిన విదేశాంగ శాఖ**

**- నిరాధారమని ఫ్యాక్ట్‌చెక్‌లో స్పష్టం**

మధ్యప్రాచ్యంలో కొన్ని రోజులుగా భీకర యుద్ధం కొనసాగు తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా నావికా దళం భారత నౌకలను ఉపయోగిస్తోందంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను కేంద్రం ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూ సందర్భంగా మాట్లాడుతూ.. 'గల్ఫ్ ప్రాంతం లో అమెరికా సైనిక స్థావరాలపై ఒత్తిడి పెరగడంతో మా నావల్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ సదుపాయాలూ ధ్వంస మయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము భారత్, ఆ దేశానికి చెందిన నౌకాశ్రయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది సరైన మార్గం కాదు. అయినప్పటికీ పరిస్థితుల ప్రభావం కారణంగా అలా చేయక తప్పడం లేదు' అని మాక్‌గ్రెగర్ అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడం తో ఈ వివాదం చెలరేగింది. దీనిపై స్పందించిన కేంద్ర విదేశాంగ శాఖ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించింది. 'భారత పోర్టులు అమెరికా దాడులకు ఉపయోగిస్తున్నాయన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అని 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. నిర్ధారణ లేని సమాచారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దని హెచ్చరించింది. మధ్యప్రాచ్యంలో ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పలు ఊహాగానాలు ప్రచారమవుతున్నాయి. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ అన్ని దేశాలతో సమానంగా దౌత్య సంబంధాలను కొనసాగిస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతున్నప్పటికీ.. ఇరాన్‌తోనూ భారత్‌కు వాణిజ్య, వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అందువల్ల భారత పోర్టులను యుద్ధ కార్యకలాపాలకు వినియోగించేందుకు అనుమతించడం వంటి చర్యలు భారత విదేశాంగ విధానానికి విరుద్ధమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా అమెరికా దాడులకు భారత్ సహకరిస్తోందన్న ప్రచారం అవాస్తవ మని కేంద్రం స్పష్టం చేయడంతో ఈ వివాదానికి తెరపడినట్లైంది.




# పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకున్న 38 భారత నౌకలు

**- అందులో 1100 మందికి పైగా నావికులు**

**- హార్మూజ్ జలసంధి మూసివేతతో నిలిచిన వైనం**

న్యూఢిల్లీ: పర్షియన్ గల్ఫ్ జలాల్లో 38 భారత నౌకలు చిక్కుకు న్నాయి. ఆ నౌకల్లో 1100 మందికి పైగా నావికులు ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా ఉన్న హార్మూజ్ జలసంధిని మూసివేశారు. దీంతో వందలాది నౌకలు సముద్ర మార్గంలోనే నిలిచిపోయాయి. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాల్లో 38 భారత జెండాలున్న నౌకలు ఉండిపోయాయి. వీటిలో కొన్ని నౌకలు ముడి చమురు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ను భారత పోర్టులకు తరలి స్తుండగా, మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తుల ను తీసుకొచ్చేందుకు వెళ్తున్నట్లు అధికారులు వెల్లడించారు. తాజా పరిస్థితిని నౌకాయాన మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తోందని, ఆయా కంపెనీలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపు తోందని తెలిపారు. కాగా, ఒమన్ నౌకాశ్రయంలో ఉన్న విదేశీ నౌకలపై ఇరాన్ జరిపిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించగా, ఒకరు గాయపడినట్లు అధికారులు ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆ ప్రాంతం లోని వివిధ నౌకల్లో మొత్తం 23 వేల మంది భారతీయ నావికు లు ఉన్నారని, వారి భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యమిస్తుందని అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, భారత నావికుల




భద్రతకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకో వాలని ఆదేశించినట్లు చెప్పారు. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో కంటెయినర్ నౌకలు పశ్చిమాసియాకు సేవలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటున్నాయని తెలిపారు. హార్మూజ్ మార్గంలో వెళ్లాల్సిన నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం గుండా నడిపిస్తున్నారన్నారు.

### హార్మూజ్‌లో చైనా నౌకలకు అనుమతి

హార్మూజ్ జల సంధి నుంచి చైనా నౌకలు వెళ్లేందుకు మాత్రం అనుమతి ఇస్తామని ఇరాన్ ప్రకటించింది. పశ్చిమాసి యాలో యుద్ధం మొదలైన తర్వాత టెహ్రాన్‌పై దాడులను చైనా ఖండించిన సంగతి తెలిసిందే. అందుకు కృతజ్ఞతగా చైనా నౌకలను హార్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో హార్మూజ్ జల సంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.


### మేం రక్షణ కల్పిస్తాం: ట్రంప్

హార్మూజ్ మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు అవసరమైతే అమెరికా నౌకాదళం రక్షణ కల్పిస్తుందని ట్రంప్ వెల్లడించారు. ఈ విషయమై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రపంచానికి ఇంధన సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు అమెరికా తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు.

### భారత్, చైనాలకు చమురు సరఫరాను పెంచుతాం: రష్యా

హార్మూజ్ జల సంధి మూసివేత, ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, చైనాలకు రష్యా ఆఫర్ ఇచ్చింది. ఈ దేశాలకు చమురు సరఫరాను పెంచేందుకు సిద్ధమని రష్యా ఉప ప్రధాని అలెగ్జాం డర్ నొవాక్ బుధవారం ప్రకటించారు. భారత్‌కు రోజూ 25–27లక్షల బ్యారెళ్ల చమురు హార్మూజ్ జల సంధి ద్వారా దిగుమతి అవుతుంది. ఈ చమురును ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి కొనుగోలు చేస్తుంది. తాజా దాడుల నేపథ్యంలో చమురు రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో రష్యా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# దద్దరిల్లుతోన్న మధ్యప్రాచ్యం!



పశ్చిమాసియాలో ఇరాన్‌కు, ఇజ్రాయెల్–అమెరికా బలగాలకు మధ్య యుద్ధం మరింత భయానకంగా మారింది. దాడులు, ప్రతిదాడులతో మధ్యప్రాచ్యం దద్దరిల్లుతోంది. ఇజ్రాయెల్–అమెరికా బలగాలు తమపై దాడులు చేసి తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హత మార్చడంపై ఇరాన్ రగిలిపోతోంది. భీకర రీతిలో ప్రతిదాడులు చేస్తోంది. గురువారం ఆరో రోజూ ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడింది. 2000 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖొర్రమ్‌షార్–4 క్షిపణిని ప్రయోగించినట్టు ఇరాన్ ప్రకటించుకుంది. సుమారు టన్ను వార్‌హెడ్స్‌తో ఉన్న క్షిపణిని ఇజ్రాయెల్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయం మీదకు ప్రయోగించినట్టు ఇస్లామిక్ రెవల్యూషరీ గార్డ్ కార్ప్స్ పేర్కొంది. అయితే ఇరాన్ ప్రకటనను ఇజ్రాయెల్ ఖండించింది. ఇజ్రాయిలీ ఎయిర్ ఫోర్స్‌లో 27వ స్క్వాడ్రన్ లేదని, బహుశా ఎయిర్‌బేస్ 27 అయిఉంటుందని,దాన్ని 2010లోనే మూసేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇదిలావుంటే,గల్ఫ్ దేశాల్లోని సుమారు 20 అమెరికా బేస్‌లను ధ్వంసం చేసినట్టు ఇరాన్ చెబుతోంది. కువైట్, బహ్రెయిన్, యూఏఈ దేశాల్లో ఆబేస్‌లున్నట్టు పేర్కొంది. మరో పక్క –ఇజ్రాయెల్‌కు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే.. ఇజ్రాయెల్‌లోని డీమోనా అణుప్లాంట్‌ను టార్గెట్ చేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌లో పాలకులు మారేవరకు యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయెల్ చేసిన ప్రకటనకు ప్రతిగా ఇరాన్ తాజా హెచ్చరికలు చేయడం గమనార్హం.

- దాడులు ప్రతిదాడులతో బయోత్పాత పరిణామాలు
- ఇజ్రాయెల్‌పైకి ఖొర్రమ్‌షార్-4 క్షిపణి వదిలిన ఇరాన్
- గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడి
- ఇరాన్‌పై ఐదువేల బాంబులు వేశామన్న ఇజ్రాయెల్
- ఇరాన్‌పై రెండంచెల దాడికి అమెరికా- ఇజ్రాయెల్ ప్రణాళిక

### అమెరికా ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడి చేసి ముంచేసిన ఘటనకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా ట్యాంకర్‌పై ఇరాన్ దాడి చేసింది. ఇరాన్ మీడియా ప్రకారం.. పర్షియన్ గల్ఫ్‌లోని యూఎస్ ట్యాంకర్‌పై క్షిపణితో దాడిచేసినట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. నౌకనుంచి భారీఎత్తున మంటలు ఎగిసిపడుతున్నట్టు వెల్లడించింది. ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. తమ యుద్ధనౌకపై దాడికి ప్రతిస్పందనగానే దాడి జరిగిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. భారత్‌లోని విశాఖపట్నంనుంచి ఇరాన్‌కు తిరిగి వెళ్తున్న ఐరిస్ దేనా–75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసిన సంగతి తెలిసిందే.

### ఇరాన్‌పై ఐదువేల బాంబులు: ఇజ్రాయెల్

ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మరింతకాలం కొనసాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. టెహ్రాన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన తమ ఆపరేషన్ కనీసం మరో రెండు వారాలపాటు కొనసాగొచ్చని ఇజ్రాయెల్ మిలిటరీ సూచనప్రాయంగా తెలిపింది. ఇరాన్ పాలన, దాని సైనిక స్థావరాలను కూలదోయడమే లక్ష్యమని ఇజ్రాయెల్ పునరుద్ఘాటించింది. మరోవైపు, ఘర్షణలు ప్రారంభమైన నాటినుంచి బుధవారం వరకు తమ వైమానిక దళం ఇరాన్‌పై 5 వేలకు పైగా బాంబులతో దాడులు చేసిందని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. తమ దాడుల్లో వేలాదిమంది ఇరాన్ సైనికులు చనిపోయారని తెలిపింది. టెహ్రాన్‌లోని అతిపెద్ద మిలిటరీ కాంపౌండ్‌పై ఇజ్రాయెల్ వైమానిక దళం బుధవారం దాడి చేసింది. 100కు పైగా యుద్ధ విమానాలతో దాదాపు 250 బాంబులను ఈ ప్రాంతంలో జారవిడిచింది. ఈ మిలిటరీ ప్రాంగణంలోనే ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) హెడాక్వార్టర్స్, ఐఆర్జీసీ కుద్స్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, ఇరాన్ సైబర్ యూనిట్, బసిజ్ పారామిలిటరీ ఫోర్స్ హెడ్ క్వార్టర్‌వంటి కీలక కార్యాలయాలున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఇవన్నీ చాలావరకు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఇక, టెహ్రాన్ ఎయిర్‌పోర్టులోని డిటెక్షన్ సిస్టమ్స్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేశాయి.

### అమెరికా అక్కడ.. ఇజ్రాయెల్ ఇక్కడ

ఇరాన్‌పై ఎక్కడెక్కడ ఎవరు దాడులు చేయాలన్న వివరాలను అమెరికాతో పంచుకున్నట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. పశ్చిమ, మధ్య ఇరాన్‌లోని మిలిటరీ స్థావరాలు, బాలిస్టిక్ క్షిపణి లాంఛర్లపై ఇజ్రాయెల్ వైమానిక దళం దాడులు చేస్తోంది. అటు దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి లాంఛర్లను అగ్రరాజ్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను టెహ్రాన్ టార్గెట్ చేస్తోంది. ఈ ఆపరేషన్ కోసం దాదాపు 1000మందికి పైగా అమెరికన్ సిబ్బంది ఇజ్రాయెల్‌లో పని చేస్తున్నారు.

### దద్దరిల్లిన బందర్ అబ్బాస్ పోర్టు

ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నేవీ స్థావరంపై దాడి జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇది అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉంటుంది. పేలుళ్ల కారణంగా జరిగిన నష్టం గురించి ఇంకా తెలియరాలేదు.

### అది ఈ ఘట్టానికి సంబంధ లేదు

ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా భీకర యుద్ధం కొనసాగిస్తున్నవేళ కీలక ప్రకటన వెలువడింది. అణ్వాయుధ కార్యక్రమాన్ని ఆపివేసే అంశాన్ని పరిశీలిస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి మాజిద్ తఖ్త వెల్లడించినట్టు స్కైన్యూస్ అరబిక్ వెల్లడించింది. ఇందుకు ఓ షరతు విధించిన ఆయన.. తమకు సంతృప్తికర ప్రత్యామ్నాయాన్ని అమెరికా ప్రతిపాదిస్తే ఈ ప్రోగ్రాముసు నిలిపివేస్తామని చెప్పినట్టు తెలిపింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని నిమిషాల్లోనే ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ క్లారిటీ ఇచ్చింది. విదేశాంగశాఖ డిప్యూటీ మంత్రి చేసిన వ్యాఖ్యలు అణు ఒప్పందంపై అమెరికాతో గతంలో జరిగిన చర్చలకు సంబంధించిందని పేర్కొంది. తాజా పరిణామంతో సంబంధం లేదని, ఇరాన్ కొత్తగా ప్రకటన చేయలేదని స్పష్టం చేసింది. మరోవైపు, తమ నౌకను ముంచేసిన అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని చెబుతోన్న ఇరాన్.. అగ్ర రాజ్యానికి చెందిన ఓ ట్యాంకర్‌పై క్షిపణి దాడికి పాల్పడింది.

### కువైట్ జలాల్లో చమురు ట్యాంకర్‌పై దాడి

కువైట్ జలాల్లో చమురు ట్యాంకర్‌పై దాడి జరిగింది. ఇంధనం సముద్రంలోకి ఒలికింది. ఈమేరకు గురువారం బ్రిటన్‌కు చెందిన మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ వెల్లడించింది. "కువైట్లోని ముబారక్ అల్ కబీర్ పోర్ట్ సమీపంలో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, తర్వాత అక్కడి నుంచి చిన్న బోటు వెళ్లిపోవడం కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ట్యాంకర్‌నుంచి ఒలికే ఇంధనం వల్ల పర్యావరణంపై ప్రభావం ఉండొచ్చు" అని ఏజెన్సీ పేర్కొంది.

### ఎగుమతులు నిలిపివేయండి: చైనా

డీజిల్, గాసోలిన్ ఎగుమతులు నిలిపివేయాలని చైనా తన రిఫైనరీలకు సూచించింది. అలాగే గల్ఫ్ దేశాలకు తన సర్వీసుల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు చైనాకు చెందిన షిప్పింగ్ సంస్థ వెల్లడించింది. ఇదిలాఉండగా, ఆరోరోజు ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. విశాఖపట్నం నుంచి వెళ్తున్న ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా–75ను అమెరికా తన జలాంతర్గామితో దాడిచేసి ముంచేసిన సంగతి తెలిసిందే. దీనిని ఇరాన్ తీవ్రంగా పరిగణించి ప్రతిగా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేసింది. పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా మిత్ర దేశాలకు చెందిన మిలిటరీ, ఆర్థిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరించింది.





## ట్రంప్‌నకు ఎదురు దెబ్బ!

**టారిఫ్‌ల సొమ్ము రిఫండ్‌కు ట్రేడ్ కోర్టు తీర్పు**

టారిఫ్‌ల సొమ్ము రిఫండ్ ఇవ్వాల్సిందేనంటూ న్యూయార్క్‌లోని ట్రేడ్ కోర్టు తీర్పునివ్వడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగానికి మరో ఎదురుదెబ్బ. 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ట్రంప్ గతేడాది విధించిన భారీ సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అట్మస్ ఫిల్ట్రేషన్ అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. దిగుమతిదారులు రిఫండ్ పొందేందుకు అర్హులని తాజాగా ట్రేడ్ కోర్టు న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్ పేర్కొన్నారు. ఈ సుంకాల సొమ్ము వాపసుకు సంబంధించిన కేసులను తానే చూడనున్నట్టు వెల్లడించారు. ఇటీవల సుప్రీం తీర్పులో ట్రంప్ టారిఫ్‌లు చెల్లవని స్పష్టం చేసింది. కానీ, రిఫండ్ల గురించి ఎలాంటి ప్రస్తావనా చేయలేదు.తాజా తీర్పుతో ఈ ప్రక్రియపై కొంత స్పష్టత వచ్చింది. తీర్పును అప్పీల్ చేస్తామని ట్రంప్ యంత్రాంగం తరపు న్యాయవాది పేర్కొన్నారు. కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్స్ ద్వారా యూఎస్‌లోకి దిగుమతయ్యే అన్ని వస్తువులు 'లిక్విడేషన్' అనే ప్రక్రియలోకి వస్తాయి. ఈ వస్తువులపై అధికారులు విధించిన సుంకంపై అభ్యంతరం తెలపడానికి దిగుమతిదారులకు 180 రోజుల సమయం ఉంటుంది. ఆ గడువు ముగిసిపోతే.. వారు యూఎస్ అధికారులు విధించిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సుంకాలు వసూలుచేయడం ఆపాలని న్యాయమూర్తి కస్టమ్స్‌ను ఆదేశించారు. ఇప్పటికే లిక్విడేషన్ ప్రక్రియ పూర్తయి ఉంటే.. సుంకాలు లేకుండా వస్తువులను తిరిగి లెక్కించాలని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా.. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధిస్తానన్న 15శాతం సుంకాలు ఈ వారంలో అమల్లోకి రావొచ్చని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.

## మినిట్ మ్యాన్-3ని పరీక్షించిన అమెరికా



పశ్చిమాసియాలో యుద్ధంవేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని అమెరికా పరీక్షించింది. మంగళవారం ఈ పరీక్ష జరపగా.. వివరాలు తాజాగా బయటికొచ్చాయి. కాలిఫోర్నియా తీరంలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్‌నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు మినిట్ మ్యాన్–3ను అమెరికా ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్షించింది. ఆయుధాల్లేని ఈ ఖండాంతర క్షిపణి మార్షల్ ఐల్యాండ్స్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ వెల్లడించింది. ఈ పరీక్ష విజయవంతమైందని, అత్యంత కచ్చితత్వంతో క్షిపణి లక్ష్యాన్ని చేరుకుందని తెలిపింది. అయితే, ఇరాన్‌పై దాడుల వేళ.. ఈ పరీక్ష నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.



## శ్రీలంక జలాల్లోని ఇరాన్ నౌకనూ పేల్చేస్తారా?

ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి ముంచేసిన విషయంతెలిసిందే.ఈ ఘటన జరిగి కొన్ని గంటలు కావస్తుండగా.. మరో ఇరాన్ నౌక శ్రీలంక దిశగా వెళ్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని శ్రీలంక మంత్రి నలిందా జయతిస్సా వెల్లడించారు. తమ దేశ ప్రాదేశిక జలాల దగ్గరలో ఆ నౌక ఉందని,అందులో ఉన్నవారి ప్రాణాలను రక్షించేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ నౌకపైనా అమెరికా దాడిచేయొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో దాదాపు 100మందికిపైగా సిబ్బంది ఉన్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే, ఈ నౌక అత్యవసర పోర్ట్ కాల్ కోసం ప్రభుత్వ అనుమతి కోరిందని, క్లియరెన్స్ కోసం వేచి చూస్తున్నట్టు శ్రీలంక ఎంపీ నమల్ రాజపక్సా వెల్లడించారు.



# టీ20 వరల్డ్‌కప్..ఫైనల్‌కు భారత్

టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా ఫైనల్‌కు చేరింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన థ్రిల్లింగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందింది. ఏడు పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ చివరి ఓవర్ వరకు మ్యాచ్‌లోనే ఉంది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105) అద్వితీయ పోరాటం చేశాడు. అయితే చివర్లో ఇంగ్లండ్ ఒత్తిడికి తలవంచింది. దీంతో విజయం సాధించిన టీమిండియా ఆదివారం అహ్మదాబాద్‌లో జరగబోయే ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. 254 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో వికెట్లు కోల్పోయినా బెతెల్ ఓ గుర్తుంచుకోదగిన ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ప్రపంచకప్‌లోనే రెండో వేగవంతమైన సెంచరీ (45 బంతుల్లో) చేశాడు. అయితే చివరి ఓవర్లో హార్దిక్ విసిరిన అద్భుతమైన త్రోకు రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. మొత్తం ఈ మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదయ్యాయి. టీమిండియా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. హార్దిక్ రెండు వికెట్లు తీశాడు.

# బాబర్‌పై వేటు



లాహోర్: టీ20 వరల్డ్‌కప్‌లో వైఫల్యం నేపథ్యంలో పాకిస్థాన్ జట్టులో భారీ ప్రక్షాళన జరిగింది. వన్డే జట్టు నుంచి సీనియర్ బ్యాటర్ బాబర్ ఆజమ్, సయీమ్ అయూబ్‌ను తప్పించారు. బంగ్లాదేశ్ టూర్‌లో భాగంగా ఈ నెల 11 నుంచి జరిగే 3 వన్డేల సిరీస్‌కు ఆరుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను ఎంపిక చేశారు. టీ20 వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన సాహిబ్జాదా ఫర్హాన్‌కు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కింది. షహీన్ షా అఫ్రీది కెప్టెన్‌గా కొనసాగనుండగా.. పేసర్ రౌఫ్, బ్యాటర్ హుస్సేన్ తలత్ రీఎంట్రీ ఇచ్చారు.

# సాత్విక్ జోడీ ఇంటికి..



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టికి చుక్కెదురైం ది. ఈ భారత ద్వయం అనూహ్యంగా ఆరంభ రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ జంట 21-23, 12-21తో మలేసియా జోడీ ఆరోన్ తాయి/కాయ్ గ్జింగ్ కాంగ్ చేతిలో ఓటమిపాలైంది. మిక్స్‌డ్‌లో భారత ద్వయం రోహన్/రుత్విక 12-21, 15-21తో ఫ్రాన్స్ జంట గిక్వెల్/డెల్ఫిన్ చేతిలో ఓటమిపాలైంది. సింగిల్స్‌లో భారత షట్లర్ ఆయుష్ శెట్టి 21-19, 9-21, 17-21తో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడాడు.

# అతడి ఆట అదుర్స్..




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా బుధవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు తలప డ్డాయి. ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. న్యూజిలాండ్ బ్యాటర్ల లో ఫిన్ అలెన్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. 33 బంతుల్లో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. అలాగే టీ20 వరల్డ్‌కప్ మ్యాచుల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ కొట్టిన బ్యాటర్‌గా రికార్డ్ సృష్టించాడు. ఈ నేపథ్యంలో అతడు టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ నుంచి ప్రశంసలు అందుకు న్నాడు. 'సెమీ-ఫైనల్స్ సాధారణంగా మనల్ని సీటు అంచున కూర్చునేలా చేస్తాయి. కానీ ఈరోజు మనం ఇంకా మన మన స్థానాల్లో కూర్చోకముందే.. ఫిన్ అలెన్ ఆటను పూర్తి చేశాడు. ఎంత అద్భుతమైన మ్యాచ్' అని సచిన్ తెందూల్కర్.. ఎక్స్ వేదికగా ఫిన్ అలెన్‌ను అభినందించాడు. ఫిన్ అలెన్ సెంచరీ చేయడంతో 2009 టీ20 వరల్డ్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లో వెస్టిండీ స్‌పై తిలక్‌రత్నే దిల్షాన్ కొట్టిన 96 పరుగుల రికార్డ్ బద్దలైంది. ఇంతకుముందు వరకు అదే టీ20 వరల్డ్‌కప్ నాకౌట్ మ్యాచుల్లో అదే అత్యధిక స్కోర్‌గా ఉండేది. అలాగే బ్రెండన్ మెకల్లమ్ (2012లో బంగ్లాదేశ్‌పై 122 పరుగులు), గ్లెన్ ఫిలిప్స్ (2022 లో శ్రీలంకపై 104 రన్స్) తర్వాత టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో సెంచరీ చేసిన మూడో కివీస్ బ్యాటర్ ఫిన్ అలెన్ నిలిచాడు.

### శ్రీలంక హోటల్‌లో మహిళా సిబ్బందితో

# పాక్ క్రికెటర్ అసభ్య ప్రవర్తన




ప్రస్తుత టీ-20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శనతో విమర్శల పాలైన పాకిస్థాన్ క్రికెట్ జట్టు తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది. అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకుం ది. పాకిస్థాన్ క్రికెటర్ ఒకరు కొలంబోలోని హోటల్‌కు చెందిన మహిళా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తించినట్టు వార్తలు వస్తున్నా యి. టీ-20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తన అన్ని మ్యాచ్‌లను శ్రీలంకలోనే ఆడిన సంగతి తెలిసిందే. శ్రీలంకతో సూపర్-8 మ్యాచ్‌కు ముందు క్యాండీలోని హోటల్‌లో విధులు నిర్వహిస్తు న్న ఓ మహిళతో ఓ పాక్ క్రికెటర్ అనుచితంగా ప్రవర్తించాడట. పాకిస్థాన్ అంతర్జాతీయ జట్టుకు చెందిన ఓ క్రికెటర్ క్యాండీలోని హోటల్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళతో అనుచితంగా ప్రవర్తించాడట. దాంతో ఆమె సహాయం గట్టిగా కేకలు వేసిందట. అప్పుడు మిగతా హోటల్ సిబ్బంది వచ్చి ఆమెను రక్షించినట్టు సమాచారం. ఆ తర్వాత హోటల్ సిబ్బంది అందరూ కలిసి ఆ క్రికెటర్‌పై యాజమాన్యానికి ఫిర్యాదు చేశార ట. ఆ హోటల్ యాజమాన్యం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని పాక్ టీమ్ మేనేజర్ నవీద్ చీమాకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఆటగాళ్ల తరఫున నవీద్ చీమా ఆ మహిళకు, హోటల్ సిబ్బందికి క్షమాపణలు చెప్పినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన ఆ క్రికెటర్‌కు భారీ జరిమానా విధించారట. అలాగే అతడు పీసీబీ క్రమశిక్షణ కమిటీ ముందు కూడా హాజరుకాబోతు న్నాడట. ఈ నేపథ్యంలో అతడికి మరిన్ని శిక్షలు విధించే అవకాశం కనబడుతోంది. అయితే ఆ మహిళను వేధించిన క్రికెటర్ ఎవరనే విషయం మాత్రం బయటకు రాలేదు.

# ఘనంగా అర్జున్ టెండూల్కర్ వివాహం

### హాజరైన మాజీ క్రికెటర్లు




టీమ్ఇండియా క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తనయుడి వివాహం నేడు ఘనంగా జరిగింది. సచిన్ - అంజలి దంపతుల కుమారుడు, క్రికెటర్ అర్జున్ టెండూల్కర్.. తన చిన్ననాటి స్నేహితురాలు సానియా చందోక్ మెడలో మూడు ముళ్లు వేశాడు. ముంబైలోని వర్లిలో ఓ గ్రాండ్ ఫైవ్ స్టార్ హోటల్లో ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగ్గా.. ఇందుకు సంబంధిం చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా గతేడాది ఆగస్టులో అర్జున్ - సానియాల ఎంగేజ్మెంట్ అత్యంత సన్నిహితుల మధ్య రహస్యంగా జరిగిన విషయం తెలిసిందే. అయితే.. కొన్నిరోజుల తర్వాత సచిన్ టెండూల్కర్ ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాడు. అర్జున్ - సానియాల వివాహం.. గురువారం తెల్లవారుజామున 12:45లకు సంప్రదాయ పద్ధతిలో జరిగినట్టు తెలుస్తోంది. ఈ వేడుక కోసం కొన్ని రోజులుగా జోరు గా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ కూడా ఘనంగా జరిగాయి. ముంబైకి చెందిన ప్రముఖ బిజినెస్‌మేన్ రవి ఘాయ్ మనుమరాలే సానియా చందో క్. ఆమె కూడా ఓ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కొనసాగుతోంది. సచిన్ కుమార్తె సారా టెండూల్కర్, సానియాలిద్దరూ ప్రాణ స్నేహితులు కావడం విశేషం. సానియా.. అర్జున్ కంటే వయసులో ఓ ఏడాది పెద్ద కూడా. ఇక.. అర్జున్ టెండూల్కర్ ప్రస్తుతం దేశీయ క్రికెట్‌లో తన కెరీర్‌ను కొనసాగిస్తున్నాడు. తండ్రి సచిన్ లాగా క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాడు. ముంబైలో జరిగిన అర్జున్ - సానియాల వివాహ వేడుక క్రికెట్ వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్ర మానికి టీమ్ఇండియా మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, సునీల్ గావస్క ర్, అనిల్ కుంబ్లే, అజిత్ అగార్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, యువరాజ్ సింగ్, జహీర్ ఖాన్, ఆశిస్ నెహ్రా, సురేశ్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, అజింక్యా రహానే, శ్రేయాస్ అయ్యర్ తదితరులు హాజర య్యారు. వ్యాపార దిగ్గజం ముకేశ్ - నీతా అంబానీ దంపతులు కూడా ఈ వేడుకకు హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు పలువురు రాజకీయ నాయకులు, బాలీవుడ్ ప్రము ఖులూ ఈ వివాహానికి విచ్చేశారు. కొత్త దంపతులకు ఆశీస్సులు అందజేసి వారి జీవిత ప్రయాణం సుఖ సంతోషాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు.

# వృషకర్మ.. నా బెస్ట్ మూవీ



అక్కినేని నాగచైతన్య నటిస్తున్న ప్రెస్టీజియస్ చిత్రం 'వృషకర్మ'. తాజాగా ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ.. 'వృషకర్మ' తన కెరీర్‌లో బెస్ట్ ఫిలిం అవుతుంది. ఎన్ని అంచనాలు పెట్టుకున్నా.. తప్పకుండా సంతృప్తి చెందుతారు. ఇవాళ నాకు ఎంతో ఆనందంగా ఉంది. 'వృషకర్మ' గ్లిమ్స్ లాంచ్ చేశాం. ఈ మోమెంట్ కోసం నేను ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నా. ఎందుకంటే ఇది నా కెరీర్‌లో వందశాతం బెస్ట్ సినిమా అవ్వబోతుంది' అన్నారు. దర్శకుడు కార్తీక్ దండు డైరెక్ట్ చేస్తున్న అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించబోతున్నారు. చైతుకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది. మొత్తానికి గ్లింప్స్ బాగా ఆకట్టుకుంటుంది. గ్లింప్స్‌తో 'వృషకర్మ'లో మంచి విజువల్ ట్రీట్ ఇచ్చారు. ఈ సినిమాకి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు.

# ఉగాదికి ఉస్తాద్ ఊచకోత




పవన్ కళ్యాణ్ అభిమానులకు చిత్ర యూనిట్ అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రెస్టీజియస్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని మేకర్స్ ముందుకు జరిపారు. నిజానికి ఈ చిత్రం మార్చి 22న విడుదల కావాల్సి ఉండగా, యశ్ నటించిన 'టాక్సిక్' వాయిదా పడటంతో, ఇప్పుడు మార్చి 19నే థియేటర్లలోకి రానుంది. ఈ మార్పుతో తెలుగు రాష్ట్రాల్లో 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంతో బాక్సాఫీస్‌వద్ద నేరుగా పోటీ నెలకొననుంది. ఉస్తాద్ విడుదల విషయాన్ని ప్రకటిస్తూ చిత్ర యూనిట్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది. 'ఈ ఉగాదికి ఉస్తాద్ ఊచకోత' అంటూ కొత్త పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మార్చిలో వచ్చే ఈద్ మరియు శ్రీరామనవమి సెలవులు ఈ సినిమా వసూళ్లకు భారీగా కలిసివచ్చే అవకాశం ఉంది. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ పాటలు అందిస్తుండగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాధ్యతలను థమన్ చూస్తుండటం విశేషం. అయితే, పాన్ ఇండియా చిత్రంగా రాబోతున్న 'ధురంధర్ 2' చిత్రానికి పవన్ కళ్యాణ్ క్రేజ్ బ్రేక్ వేయనుందా..? అంటే తెలుగులో అవుననే మాట వినిపిస్తోంది. పవన్ క్రేజ్ దృష్ట్యా ఉస్తాద్ చిత్రానికే ఎక్కువ థియేటర్లు కేటాయించే అవకాశం ఉంది. దీంతో 'ధురంధర్ 2'కి కొంతవరకు డ్యామేజ్ జరగడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ విషయంపై ధురంధర్-2 మేకర్స్ ఎలాంటి ఆలోచన చేస్తారో చూడాలి.

## నెం.1 ట్రెండింగ్‌లో

# రై రై రా రా

రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న సినిమానుంచి ఇటీవల విడుదలైన రెండో సాంగ్ 'రై రై రా రా' ప్రస్తుతం యూట్యూబ్‌లో నంబర్ 1 పొజిషన్‌లో ట్రెండింగ్ అవుతూ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన మాస్ ఆంథెమ్, విడుదలైన కొద్ది సేపటికే మిలియన్ల వ్యూస్ సొంతం చేసుకుంది. పాటలో రామ్‌చరణ్ తనదైన శైలిలో అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్‌తో అలరించగా, హీరోయిన్ జాన్వీకపూర్ తన గ్లామర్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది.

పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రంలో రామ్‌చరణ్ ఊర మాస్‌లుక్‌లో కనిపిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మవంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకానుంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ తుదిదశలో ఉండగా, రామ్‌చరణ్ తన పార్ట్ డబ్బింగ్‌ను కూడా ప్రారంభించినట్టు సమాచారం.



# నావంతు సాయం చేస్తా..

ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుండే రియల్ హీరో సోనూసూద్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న ప్రయాణికులకు ఆయన సాయం చేయనున్నట్టు ప్రకటించారు. అక్కడ ఇబ్బందిపడుతున్న వారికి ఉచితంగా వసతి కల్పించనున్నట్టు చెప్పారు. ఎలాంటి షరతులు లేవని.. ఏ దేశస్థులైనా ఉచితంగా బస చేయవచ్చన్నారు. ఇలాంటి సమయంలో మానవత్వం మాత్రమే ముఖ్యమని సోనూసూద్ పేర్కొన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారు తనకు ఇన్‌స్టాలో మెసేజ్ చేస్తే తన టీమ్ వారిని సంప్రదిస్తుందన్నారు. కరోనా సమయంలో లక్షలాది వలస కార్మికులను స్వస్థలాలకు చేర్చిన సోనూసూద్, తాజా పరిణామాలతో విదేశాల్లో చిక్కుకున్న వారికి కూడా అండగా నిలవడంపై నెట్టింట ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.




# ఎన్బీకె 111- మొదలైన షూటింగ్

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేనిల క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న పీరియాడిక్ డ్రామా షూటింగ్ బుధవారం రాత్రి మొదలైంది. సతీష్ కిలారు నిర్మాణంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న చిత్రం బాలయ్య కెరీర్‌లో 111వ ప్రాజెక్ట్ కావడం విశేషం. ఈ సినిమా ప్రారంభానికి సంబంధించి సినిమాటోగ్రాఫర్ అరవింద్ ఎస్ కశ్యప్ షూటింగ్ లొకేషన్‌నుండి ఆసక్తికరమైన ఫోటోను ఇన్‌స్టాలో పంచుకోవడంతో నందమూరి అభిమానుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. చారిత్రక నేపథ్యంతో సాగే కథలో బాలకృష్ణ శక్తివంతమైన మహారాజు పాత్రలో కనిపిస్తారని, గత చిత్రాలకంటే భిన్నంగా పాత్ర ఉండనుందన్న సమాచారం ఆసక్తి రేకెత్తిస్తోంది.నయన తార కథానాయికగా నటిస్తున్న చిత్రానికి ఎస్.ఎస్. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన 'వీరసింహా రెడ్డి' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈసారి బాక్సాఫీస్‌వద్ద గర్జన అంతకంటే గట్టిగా ఉంటుందని గోపీచంద్ మలినేని ధీమావ్యక్తం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే చిత్రమని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.



# వెనక్కెళ్లిన బ్యాండుమేళం!



కన్నడ స్టార్ యష్ నటించిన 'టాక్సిక్' వాయిదాతో ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో పలుచిత్రాల తమరిలీజ్ డేట్లను మార్చుకుంటున్నాయి. టాలీవుడ్ లో పవన్‌కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ ఫిలిం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఖాళీ అయిన ఆ స్లాట్‌ను దక్కించుకుంది. దీని ప్రభావంతో మరో తెలుగు చిత్రం తన రిలీజ్ ప్లాన్ మార్చుకోవాల్సి వచ్చింది. 'కోర్ట్' మూవీ ఫేం యంగ్ జోడీ హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటిస్తున్న చిత్రం 'బ్యాండ్ మేళం'. గతంలో ఈ సినిమా వాయిదా పడుతుందనే ప్రచారం జరిగినప్పటికీ, మేకర్స్ మార్చి 13న వస్తున్నట్టు స్పష్టం చేశారు. అయితే, పవన్‌కళ్యాణ్ సినిమా ముందుగా వస్తుండటంతో, పోటీని నివారించేందుకు చిత్రయూనిట్ తమ నిర్ణయాన్ని మార్చుకుంది. ఇప్పుడు సినిమాను మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. కొత్త విడుదల తేదీని తెలుపుతూ అధికారికంగా ఒక పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. సతీష్ జవ్వాజి దర్శకత్వంలో తెరకెక్కు తున్న చిత్రంలో సీనియర్ నటుడు సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రలో కనిపిస్తున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య మరియు శ్రావ్య చిత్రాన్ని నిర్మించారు. విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు సంగీతం సమకూర్చారు.

# ట్రైన్‌లోనైనా కొరియావెళ్తా

మీకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులే మీ మనసుని ఎక్కువగా పరీక్షిస్తారంటూ తన కలల ప్రపంచంలోని పరిస్థితుల గురించి పంచుకుంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. చిన్న గ్రామంలో కలలు కంటూ.. ట్రైన్ ఎక్కైనా కొరియా వెళ్తానంటూ మొదలైన తన ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'మేడ్ ఇన్ కొరియా' చూడాల్సిందే. క్రాస్ కల్చర్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని రా. కార్తిక్ తెరకెక్కించారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్స్‌లో భాగంగా రూపొందిన సినిమా ఈనెల 12నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది నెట్‌ఫ్లిక్స్.'కొన్నిసార్లు మీరు ఊహించని వ్యక్తుల నుంచి ప్రేమని పొందుతారు.. కొరియాపట్ల నాకున్న ప్రేమ నన్ను నేను తెలుసుకునేలా చేసింది'లాంటి ఆసక్తికరమైన డైలాగులు.. కొరియాలో ఎదురైన చేదు అనుభవాల ప్రియాంక సన్నివేశాలతో ఆకట్టుకునేలా ఉందీ ట్రైలర్. ఈ సినిమాలో దక్షిణ కొరియా నటుడు పార్క్ హై జిన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఓ తమిళ అమ్మాయి కొరియా వెళ్లిన నేపథ్యంతో రూపొందిందీ చిత్రం.